ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 02.04.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 13 పేజీలు: 10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



ఢిల్లీ బోణీ.. లక్నోపై ఘన విజయం 10



కమ్యూనలిస్టు మోడీ, కమ్యూనిస్టు విజయన్

ఇద్దరిని ఓడిస్తేనే కేరళంకు మంచి రోజులు

- వారివి విభిన్న భావజాలాలైనా, భావాలొక్కటే
- ఎల్డీఎఫ్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లే
- కేరళంలో బీజేపీకి లక్ష్మణరేఖ గీసింది యూడీఎఫ్‌నే
- కేరళం ప్రజలు బీజేపీ, ఎల్డీఎఫ్‌కు గుణపాఠం చెప్పాలి
- ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

తిరువనంతపురం, ఏప్రిల్1: కేరళంలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్)కు ఓటు వేస్తే బీజేపీకి ఓటు వేసినట్లేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ కమ్యూనలిస్టు ప్రధాని నరేంద్ర మోడీ, తివేంద్రం కమ్యూనిస్టు ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఓడగొడితేనే కేరళంకు మంచి రోజులు వస్తాయన్నారు. మోడీ, విజయన్‌వి విభిన్న భావజాలాలైనా, భావాలొక్కటేనని, ఎల్డీఎఫ్, బీజేపీల మధ్య ఒప్పందాలు ఉన్నాయని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ

...:: మిగతా 2లో

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



- సమీకృత భూభారతి పోర్టల్‌తో తొలిఅడుగు
- రేపటి నుంచి ఐదు మండలాల్లో అమలు
- స్మార్ట్ ఫోన్‌తో ఇంటినుంచే భూసేవల లభ్యత
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్1: రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో రెవెన్యూ శాఖలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా రైతులకు పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తయారు చేశామన్నారు. ఈ పోర్టల్‌ను ఈనెల 2 నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి భూ వివాదాల పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నామని వెల్లడించారు. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. కేరళం పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాసరెడ్డి బుధవారం ఈ పోర్టల్ ప్రారంభానికి సంబంధించి రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించామని, సామాన్య ప్రజానీకానికి ముఖ్యంగా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 2 నుంచి ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా

...:: మిగతా 2లో



తేయాకు తెంపిన ప్రధాని మోదీ

అసోంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ అక్కడ పర్యటిస్తున్నారు. అయితే డిబ్రూఘర్‌లో బుధవారం ఉదయం ఓ టీ గార్డెన్‌కు ప్రధాని మోదీ వెళ్లారు. స్థానిక మహిళా కార్మికులతో కలిసి ఆయన తేయాకును తెంపారు.

9



పౌరసత్వం తనిఖీ ఈసీ పని కాదు

భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అభ్యంతరం వ్యక్తం చేశారు. పౌరసత్వాన్ని తనిఖీ చేయడం ఎన్నికల సంఘం పరిధిలో లేదని, అది హోం మంత్రిత్వ శాఖ బాధ్యత అని స్పష్టం చేశారు.

9





అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- రేపు రాజ్యసభ ముందుకు బిల్లు
- రాష్ట్రపతి ఆమోదం తర్వాత గెజిట్ నోటిఫికేషన్
- బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు
- బిల్లును వ్యతిరేకించిన వైఎస్సార్సీపీ
- ప్రధాని, అమిత్‌షాకు కృతజ్ఞతలు: పెమ్మసాని
- ఇక ముక్కలాటలు సాగవు: బీజేపీ ఎంపీ సీఎం రమేష్

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఏప్రిల్1: అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 2024 జూన్ 2 నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టం 2014లోని సెక్షన్ 5(2)కి సవరణ చేస్తూ కేంద్ర హోం శాఖ రూపొందించిన బిల్లును ఆ శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సుమారు 2 గంటలపాటు

...:: మిగతా 2లో

డిగ్రీ లెక్చరర్ పోస్టుల్లో అక్రమాలకు కుట్ర



- తమవారికే ఇచ్చేలా జీవో నంబర్ 4 తెచ్చిన ప్రభుత్వం
- యువతకు ఉద్యోగాలు దక్కకుండా అడ్డంకులు
- పీహెచ్డీకి 25 మార్కుల వెయిటేజ్ కూడా కుట్రలో భాగమే
- ప్రతి నోటిఫికేషన్ కు ఏదో ఒక జీవో అడ్డు
- జీవో నంబర్లు 104, 29, 46, 81లను వెంటనే రద్దు చేయాలి
- రేషన్ కార్డులు ఏరి వేసే పైశాచికం మానేయాలి
- కొండగట్టు ఘటనపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్ 1: గ్రూప్ 1 తరహాలో డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులను తమవారికి కట్టబెట్టడానికి కుట్రలు చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు దక్కకుండా జీవోల పేరుతో ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని కవిత మండిపడ్డారు. ప్రభుత్వం ఏ నోటిఫికేషన్ వేసిన సరే దానికి ఒక జీవో అడ్డంకిగా మారిందన్నారు. ముఖ్యంగా డిగ్రీ లెక్చరర్ల పోస్టుల కోసం వేసిన నోటిఫికేషన్‌కు అడ్డుగా జీవో నంబర్ 4 తెచ్చారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ లెక్చరర్ల పోస్టుల నియామకాల్లో కుట్ర జరుగుతోందని చెప్పారు. గ్రూప్1 లో తాము అనుకున్న వారికే ఉద్యోగాలు ఇచ్చేలా ప్రత్యేక ఎగ్జామినేషన్ సెంటర్ పెట్టి కుట్ర చేశారని గుర్తు చేశారు. సరిగ్గా అదే విధంగా డిగ్రీ లెక్చరర్ల భర్తీ విషయంలోనూ ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే జీవో నంబర్ 4 తో పాటు పీహెచ్డీ చేసిన వారికి 25 మార్కుల వెయిటేజీ, ఇంటర్వ్యూ కి పది మార్కులంటూ నిబంధనలు తమ వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారని విమర్శించారు. అసలు పీహెచ్డీ అడ్మిషన్లే లేకుండా 25 మార్కుల వెయిటేజీ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. స్టేట్ ఎలిజిబుల్ టెస్ట్ మూడేళ్లుగా నిర్వహించకపోవటంతో ఎంతో మందికి

...:: మిగతా 2లో



ఇది బీజేపీ లూట్ దివస్

దేశంలో నుంచి చాలా నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని, ఇది బీజేపీ లూట్ దివస్ అని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. భారత్ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు సర్వ నాశనం చేయబట్టే ఈ దుస్థితి దాపురించిందన్నారు.

9



...:: 2లో

ప్రజా పోరాటాన్ని నవ్వులపాలు చేస్తున్న కాంగ్రెస్

- ఆంధ్రకు రాజధాని లేనిపరిస్థితి దురదృష్టకరం
- అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి విమానాశ్రయాలు ఇవ్వలేదు
- విమానాశ్రయాలకు భూమి కోసం లేఖలు రాశాం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు స్పందించలేదు
- లోక్ సభలో మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు పై చర్చ

ప్రజలను తప్పుదోవ పట్టించాలనే ప్రయత్నం

- కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఏం చేశారు?
- కారు స్క్రిప్ట్‌ను లోక్ సభలో కిషన్ రెడ్డి చదివారు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఎంపీ చామల కౌంటర్

...:: 2లో



రాష్ట్రవ్యాప్తంగా మూత పడ్డ చికెన్‌షాపులు

- ఇందిరాపార్క్ వద్ద చికెన్ వ్యాపారుల ధర్నా
- వ్యాపారుల్లో భిన్నాభిప్రాయాలతో పలుచోట్ల స్వల్ప ఘర్షణలు
- అక్కడక్కడా తెరిచిన షాపులపై యూనియన్ దాడులు
- రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జోక్యం చేసుకోవాలి
- చికెన్ ధరలు, కమిషన్ మార్జిన్ ధరలు నిర్ణయించాలి
- చికెన్ అమ్మకందారుల అసోసియేషన్ విజ్ఞప్తి
- నాటుకోళ్లకు ఒక్కసారిగా పెరిగిన డిమాండ్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్1: రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపులు అన్ని మూతపడ్డాయి. డీలర్లకు ఇవ్వాల్సిన పర్సంటేజ్‌ను తగ్గించడంతో చికెన్ షాప్ యజమానులు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నారు. పర్సంటేజ్ తగ్గింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కంపెనీలు మార్జిన్లు తగ్గించడం వల్ల చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని అసోసియేషన్ నేతలు ఆరోపిస్తున్నారు. చికెన్ షాపులు మూతపడడంతో

...:: మిగతా 2లో



ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం

- దుకాణాలకు దశలవారీగా సరఫరా
- బయోమెట్రిక్ మిషన్లలో సాంకేతిక మార్పులు
- ఒకేసారి వేలిముద్ర వేసేలా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్
- ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వెసులుబాటు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్1: రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డు లబ్ధిదారులకు భారీ వెసులుబాటు కల్పించాయి. ఏప్రిల్ నెలలో ఒకేసారి మూడు నెలల (ఏప్రిల్, మే, జూన్) కోటాను పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు

...:: మిగతా 2లో



కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

క్రైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు చుక్కెదురైంది.

9

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లు పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రైతులు మీ సేవ కేంద్రాలకు వెళ్లవలసిన పనిలేకుండా ఇంటి నుంచే భూ సేవలు పొందేవిధంగా పోర్టల్‌ను రూపొందించామని అన్నారు. రైతులు తమ భూమి హద్దులు తేల్చాలని సర్వే అధికారుల చుట్టూ తిరిగేవారని, ఇప్పుడు ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి నుంచే భూభారతి పోర్టల్ ద్వారా పొందవచ్చన్నారు. రైతు లాగిన్ అయిన వెంటనే తనకు ఉన్న భూమి వివరాలు కనిపిస్తాయని, ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు ఎంత చెల్లించాలో కనిపిస్తుందని, ఫీజు చెల్లించిన తర్వాత ఆ వివరాలు ఆ గ్రామంలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళుతాయని మంత్రి తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ ను జనరేట్ చేసి భూభారతి పోర్టల్లో అప్‌లోడ్ చేస్తారని, ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేవరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ అలర్ట్స్ పంపిస్తారని మంత్రి తెలిపారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే మ్యాప్ (ఎల్‌పిఎమ్) యూనిక్ నెంబరు, అదే విధంగా ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని వెల్లడించారు.

ప్రజా పోరాటాన్ని నవ్వులపాలు చేస్తున్న కాంగ్రెస్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: తెలంగాణ ప్రజల పోరాటాన్ని నవ్వులపాలు చేసే విధంగా కాంగ్రెస్ పాలన సాగుతోంది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతిని ధ్రువీకరిస్తూ బుధవారం లోక్‌సభలో బిల్లును ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2026పై చర్చ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. సుదీర్ఘమైన పోరాటం తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని, కాంగ్రెస్ ప్రభుత్వం1969లో జై తెలంగాణ అన్నందుకు 369 మంది ఉద్యమకారులను కాల్చి చంపిందని అన్నారు. ఆ తర్వాత చివరిదశ తెలంగాణ ఉద్యమంలోనూ.. 1,200 మంది ఆత్మబలిదానం చేశారని, వారి త్యాగంతోనే తెలంగాణ వచ్చిందని, నాలుగు కోట్ల మంది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ తెచ్చుకున్నారని అన్నారు. 'రాష్ట్రం విడిపోయిన తర్వాత.. తెలంగాణతో పాటుగా ఆంధ్రప్రదేశ్ కూడా పోటీగా అభివృద్ధి చెందాలని భావించాం. కానీ అక్కడి మా సోదర, సోదరీమణులు మాకు రాజధాని లేదని బాధపడే పరిస్థితి నెలకొనడం దురదృష్టకరం. ఈరోజు బిల్లుపై చర్చ సందర్భంగా.. కాంగ్రెస్ సభ్యులు కొందరు.. తెలంగాణకు విమానాశ్రయాలు లేవని చెప్పారు. తెలంగాణలో విమానాశ్రయాలు లేకపోవడానికి కారణం ఎవరు? ఆ పాపం ఎవరిదో చెప్పగలరా? ఆంధ్రప్రదేశ్‌లో 8 విమానాశ్రయాలున్నాయంటే, తెలంగాణలో కేవలం ఒక ఎయిర్ పోర్ట్ మాత్రమే ఉంది. అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి విమానాశ్రయాలు ఇవ్వలేదు' అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కొత్తగూడెం, వరంగల్, ఆదిలాబాద్‌లలో విమానాశ్రయాలకు భూమి కోసం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి లేఖలు రాసినా, భూములు కేటాయించలేదు.. కనీసం స్పందించలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తలో వరంగల్, ఆదిలాబాద్‌లలో విమానాశ్రయాల ఏర్పాటుకు భూములు కావాలని కోరినా, బీఆర్ఎస్ వ్యవహరించిన తీరే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం వ్యవహరించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు రైల్వేలు, జాతీయ రహదారుల అభివృద్ధి జరగలేదని కిషన్‌రెడ్డి అన్నారు. అంతేకాకుండా.. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ.. తెలుగు రాష్ట్రాలను నిర్లక్ష్యం చేసింది కాబట్టే, మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు రాష్ట్రాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. 'ఇవాళ తెలంగాణ రాష్ట్ర ప్రజల పక్షాన.. అమరావతి రాజధానిగా ఏర్పాటవుతున్న సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక అభినందనలు . అమరావతి అద్భుతమైన రాజధానిగా అభివృద్ధి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.' అని అన్నారు. గతంలో పదేళ్లపాటు తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో తెలంగాణను దోచుకుంటోందని అన్నారు. దీని నుంచి తెలంగాణ ప్రజలు జాగృతం కావాల్సిన అవసరం ఉందని, ఏ లక్ష్యం కోసమైతే తెలంగాణను తెచ్చుకున్నామో, ఆ లక్ష్యాల సాధన జరగడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించాలనే ప్రయత్నం

- పదేళ్ల కాలంలో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంది
- కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఏం చేశారు?
- కేసీఆర్ కుటుంబంతో ఆయన మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారా?
- మూసీ ప్రక్షాళన, ట్రిపుల్ ఆర్, మెట్రో ఫేజ్-2కు నిధులు ఎందుకు తేవడం లేదు?
- కారు పార్టీ స్క్రిప్ట్‌ను లోక్ సభలో కిషన్ రెడ్డి చదివారు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఎంపీ చామల కౌంటర్

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, ఏప్రిల్1: లోక్‌సభలో తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఏపీ పునర్విభజన చట్టం బిల్లుపై చర్చ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడిన తీరుపై చామల మండిపడ్డారు. లోక్ సభలో తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించాలని కేంద్రమంత్రి ప్రయత్నించారని ఆగ్రహించారు. తానూ సభలో ఉన్నానని చెప్పుకునే ప్రయత్నం కిషన్ రెడ్డి చేశారన్నారు. బీజేపీలో కిషన్ రెడ్డి ఎన్నో ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారని, కేంద్ర మంత్రి వంటి పదవుల్లోనూ ఉన్నారన్నారు. తెలంగాణలో గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్, కేసీఆర్ కుటుంబం దోచుకుంటుంటే కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఏం చేశారని ఎంపీ చామల ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంతో ఆయన మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారా? అని నిలదీశారు. వాళ్లు దోచుకుంటే కిషన్ రెడ్డి దాచుకున్నారా? అంటూ ఆరోపణలు గుప్పించారు చామల. కిషన్ రెడ్డి కుమ్మక్కు రాజకీయాలు తెలంగాణ ప్రజలకు తెలుసునంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అవినీతి, కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణంపై సీబీఐ విచారణ ఎందుకు చేయలేదంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేస్తే కిషన్ రెడ్డి ఎందుకు సైలెంట్ గా ఉన్నారన్నారు. కేంద్ర క్యాబినెట్ మంత్రిగా కిషన్ రెడ్డి ఏనాడైనా ప్రధాని మోదీ దగ్గర తెలంగాణ గురించి మాట్లాడారా? అని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన, ట్రిపుల్ ఆర్, మెట్రో ఫేజ్ 2కు కిషన్ రెడ్డి నిధులు ఎందుకు తీసుకురావడం లేదని ఆగ్రహించారు. బీఆర్ఎస్ పాలనకు కేంద్రమంత్రి వంతపాడారని.. తెలంగాణలో ఆయన ప్రేక్షకపాత్రకు పరిమితం అయ్యారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీకి 8 లోక్ సభ సీట్లు ఇచ్చిందని.. కారు పార్టీ స్క్రిప్ట్‌ను లోక్ సభలో కిషన్ రెడ్డి చదివారని విమర్శించారు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్ సభలో లేరు కాబట్టి కిషన్ రెడ్డే బీఆర్ఎస్ తరఫున వకాలత్ తీసుకుని మాట్లాడుతున్నారని ఎంపీ చామల మండిపడ్డారు. ఇకనైనా కిషన్ రెడ్డి మారాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలు కళ్లు తెరిచారు కాబట్టే రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ పార్టీని ఇంటికి పంపి రేవంత్ రెడ్డిని సీఎం చేసుకున్నారని ఎంపీ చామల చెప్పుకొచ్చారు.



ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం

మొదటిపేజీ తరువాయి

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు సంబంధించి రేషన్ కోటాను విడుదల చేసిన పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం నుంచి ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు పీడీఎస్ బియ్యం సరఫరా ప్రారంభించింది.

బియ్యం కేటాయింపులు ఇలా..

మూడు జిల్లాల పరిధిలో సుమారు 21,46,995 ఆహార భద్రత కార్డులున్నాయి. మొత్తం 76,91,452 యూనిట్లు ఉన్నాయి. తాజాగా మూడు నెలల కోటా కింద దాదాపు 14,27,621.31 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని విడుదల చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ నిబంధనల ప్రకారం ఆహార భద్రత కార్డులోని ప్రతి యూనిట్ (లబ్ధిదారు)కు నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నారు. తాజాగా మూడు నెలల కోటా ఒకేసారి ఇస్తున్నందున ఒక్కో యూనిట్‌కు 18 కిలోల చొప్పున నలుగురు సభ్యులున్న కుటుంబానికి 72 కిలోలు, ఐదుగురు సభ్యులున్న కుటుంబానికి 90 కిలోలు ఇవ్వనున్నారు. అంత్యోదయ కార్డుదారులకు మాత్రం నెలకు 35 కిలోల చొప్పున మూడు నెలలకు కలిపి 105 కిలోలు పంపిణీ చేస్తారు. లబ్ధిదారులు పోర్టబిలిటీ సౌకర్యం ద్వారా అందుబాటులోని ప్రభుత్వ చౌక ధరల దుకాణంలో బియ్యం తీసుకోవచ్చు.

ఈ–పాస్‌లో మార్పులు చేర్పులు

లబ్ధి కుంటుబాలకు ఒకేసారి మూడు నెలల కోటా పంపిణీ చేస్తుండటంతో అందుకు అనుగుణంగా ఈ-పాస్ (బయోమెట్రిక్) మిషన్లలో సాంకేతిక మార్పులు చేర్పులు చేస్తున్నారు. సరుకులు డ్రా చేసే లబ్ధిదారు ఒక్కో నెలకు విడివిడిగా మూడుసార్లు కాకుండా ఒకేసారి వేలిముద్ర వేసేలా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. కాగా ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో మూడు నెలల స్టాక్ ఉంచేంత స్థలం లేకపోవడంతో బియ్యం నిల్వ చేయడం డీలర్లకు తలకు మించిన భారంగా తయారైంది. చాలా దుకాణాలు చిన్నపాటి మడిగెల్లో నిర్వహిస్తుండటంతో వందల క్వింటాళ్ల బియ్యాన్ని భద్రపరచడంపై డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీలర్ల డిమాండ్ మేరకు దశలవారీగా దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తేందుకు పౌరసరఫరా అధికారులు చర్యలు చేపట్టారు.



నిర్మాతగా నిలదొక్కుకోవాలంటే అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని రామ్‌చరణ్ అన్న నాకు సలహా ఇచ్చారు. రామ్‌చరణ్ అన్న చెప్పిన 'నెవర్ సే నెవర్' రూల్ కచ్చితంగా పాటిస్తా. అన్నయ్య వరుణ్ తేజ్ హీరోగా నేను నిర్మించనున్న సినిమా బడ్జెట్ ₹60కోట్లు.
- మెగాడాటర్ నిహారిక

కమ్యూనలిస్టు మోడీ, కమ్యూనిస్టు విజయన్

మొదటిపేజీ తరువాయి

స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళలోని నేమం సహా పలు నియోజకవర్గాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని సభల్లోనూ ముఖ్యమంత్రి ప్రసంగాలకు భారీ స్పందన లభించింది. నేమం నియోజకవర్గంలో యూడీఎఫ్ అభ్యర్థి కేఎస్ శబరీనాథన్ తరఫున పూంథురలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను కేరళలోకి రానీయకుండా లక్ష్మణ రేఖ గీసింది యూడీఎఫ్ నే అన్నారు. కేరళలో జాతీయ రహదారులు సహా పలు అభివృద్ధి పనులు నిలిచిపోయినా ముఖ్యమంత్రి పినరయి విజయన్ నోరుమెదపడం లేదని ఆయన మండిపడ్డారు. కేరళ ప్రజలు బీజేపీ, ఎల్డీఎఫ్‌కు గుణపాఠం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేరళ భవిష్యత్తును దెబ్బతీయాలని చూస్తున్నారని సీఎం విమర్శించారు. బీజేపీ, సీపీఎం మధ్య సైలెంట్ అండర్‌స్టాండింగ్ ఉందని అన్నారు. అందుకే వారిపై ఎటువంటి కేసులు ఉండవని విమర్శించారు. దేశంలో ఎవరినైనా బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐతో వేధిస్తారని, కానీ, విజయన్ సర్కారుపై ఇగ కూడా వాలనీయరని ఆగ్రహించారు. బీజేపీ, ఎల్‌డీఎఫ్ బయటకు పోటీ పడుతున్నట్టు కనిపించినా, అది ఉత్తిత్తిదేనని చెప్పారు. కేరళం సమగ్రాభివృద్ధి యూడీఎఫ్ లక్ష్యమన్నారు. విద్యావంతులైన ఎందరో మలయాళీలు స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని, వారికి స్థానికంగా ఉపాధి కల్పించే పరిశ్రమలు తగిన సంఖ్యలో లేవన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు కేరళం సమగ్రాభివృద్ధికి యూడీఎఫ్ ప్రణాళికలు రచిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలు, యువతకు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే న్యాయం జరుగుతుందని రేవంత్ పిలుపునిచ్చారు. హస్తం పార్టీకి ఓటేస్తే పాత కేరళం ఏమిటో మళ్లీ చూపిస్తామని హామీ ఇచ్చారు. డెవలప్‌మెంట్ విత్ డిగ్నిటీతో ముందుకు వెళుతున్నామని సీఎం తెలిపారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ముఖ్యమంత్రులది నిష్కళంక రాజకీయం

సామాజిక ప్రగతి, అభివృద్ధి, అక్షరాస్యతలో కేరళం ఎప్పటినుంచో యావత్ దేశానికే ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందని, అందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన కృషే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విద్యా రంగంలో కేరళంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు సాధించిన ప్రగతిని సీఎం వివరించారు. దేశంలో అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా కేరళంకు ఉన్న గుర్తింపును రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. విద్య, అవగాహన, సామాజిక చైతన్యంలో కేరళం దేశానికి అప్పటికీ, ఇప్పటికీ నమూనాగా ఉందని సీఎం తెలిపారు. ఇందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీ, ఏకే ఆంటోనీల కృషి ప్రధాన కారణమన్నారు. వాళ్లు కేరళంకు సమగ్ర, సమ్మిళిత, సమతుల్య, నిష్కళంక రాజకీయాలను అందించారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. కరుణాకరన్ కేరళలో అభివృద్ధికి బాటలు వేశారని, ఊమెన్ చాందీ సంక్షేమం అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇచ్చారని, ఏకే. ఆంటోనీ నిజాయితీకి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పాలనలో కేరళంకు గౌరవం, నమ్మకం, పరిపాలనా స్థిరత్వం వచ్చిందన్నారు. కేరళంను "గాడ్స్ ఓన్ కంట్రీ" గా పిలుస్తారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అందుకే, దేశంతోపాటు, ప్రపంచవ్యాప్తంగా కేరళం ఒక బ్రాండ్‌గా నిలిచిందన్నారు. పర్యాటకం, విద్య, ఆరోగ్యం, సామాజిక పురోగతి ఇవన్నీ కేరళంను ఒక ప్రత్యేక రాష్ట్రంగా నిలబెట్టాయన్నారు.

అక్కడా.. ఇక్కడా వైఫల్యం..

గత 12 ఏండ్లుగా ఢిల్లీలో... 10 ఏండ్లుగా కేరళంలో పరిస్థితులు పూర్తిగా దిగజారాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో మోడీ, కేరళంలో విజయన్ "డబుల్ ఫెయిల్యూర్"గా నిలిచారని సీఎం విమర్శించారు. ఢిల్లీలో మోడీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం, తిరువనంతపురంలో విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ సర్కారులో దేశం, రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లాయని విమర్శించారు. వీరి ఇరువురి సిద్ధాంతాలు వేరు అయినా, వైఫల్యాలు మాత్రం ఒకేలా ఉన్నాయని మండిపడ్డారు. నిరుద్యోగంతో ఇక్కడి యువత ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు.

తెలంగాణ బాటలో కేరళం..

సోనియా గాంధీ దత్తత తీసుకున్న తెలంగాణ అభివృద్ధి మార్గంలో పయనిస్తోందని.. కేరళం కూడా అలానే ముందుకు వెళ్లాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కేరళం అభివృద్ధికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వం వహిస్తారని సీఎం అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కేరళం కుటుంబ సభ్యుల్లా మారారని సీఎం తెలిపారు.

విజయన్ నీ సమయం అయిపోయింది.. వెళ్లిపో

మలయాళీ సూపర్ స్టార్ మోహన్‌లాల్ నరసింహం సినిమాలో చెప్పిన "నీ పో మోనే.. దినేశా.." స్టైల్‌లో "నీ పో మోనే విజయన్.. యువర్ టైమ్ ఈజ్ ఓవర్" (విజయన్ నీ సమయం అయిపోయింది.. వెళ్లిపో) అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన డైలాగ్‌కు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. మలయాళంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుకరించడంతో యువత నుంచి భారీ స్పందనలభించింది.

రాష్ట్రవ్యాప్తంగా మూత పడ్డ చికెన్‌షాపులు

మొదటిపేజీ తరువాయి

మాంసాహార ప్రియులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు చికెన్ షాపులు మూతపడటంతో ఒక్కసారిగా నాటుకోళ్లకు డిమాండ్ పెరిగింది.

హైదరాబాద్‌లో ఉద్రిక్తత

అసోసియేషన్ పిలుపుతో హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చికెన్ షాపులు మూతపడ్డాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో షాపులు యథావిధిగా తెరుచుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హైదరాబాద్ ఎల్బీనగర్ లో బంద్‌కు మద్దతుగా ఉన్న అసోసియేషన్ సభ్యులు షాపులు తెరిచిన యజమానులను అడ్డుకోవడంతో వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి. .

మార్జిన్ తగ్గించటంతో గిట్టుబాటు కావట్లేదు..

మార్జిన్ తగ్గించటంతో తమకు గిట్టుబాటు కావటం లేదని చికెన్ షాపుల సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోళ్లను తీసుకురావడానికి ట్రావెలింగ్ ఖర్చు, షాపు రెంట్లు, వర్కర్ల జీతాలు పోను. తమను కనీస లాభం కూడా మిగలటం లేదని వాపోతున్నారు. పౌల్ట్రీ యజమానులు, ప్రభుత్వం నుంచి రాయితీ లు పొందుతూ తక్కువ రేటుకే కోళ్లను పెంచుతున్నారని తెలిపారు. కానీ షాపులకు వేసే కోళ్లపై మార్జిన్ తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దుకాణాల నిరవధిక బంద్ కొనసాగిస్తాం

కిలో చికెన్ పై 40 రూపాయలు మార్జిన్ ఇవ్వాలని, లేని పక్షంలో వినియోగదారుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని విధానపరంగా చికెన్ ధరలు, కమిషన్ మార్జిన్ ధరలు నిర్ణయించాలని చికెన్ అమ్మకందారుల సంఘాలు కోరుతున్నారు. చిల్లర వ్యాపారులను లేకుండా చేయాలన్న కుట్ర వీడి పౌల్ట్రీ కంపెనీలు ముందుకు రాకపోతే దుకాణాల నిరవధిక బంద్ కొనసాగిస్తామన్నారు. ఈ మేరకు వారు ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా చేపట్టారు. ఈ మహాధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి చికెన్ వ్యాపారులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని చికెన్ వ్యాపారులకు సంఘీభావం తెలిపారు. పౌల్ట్రీ కంపెనీలు సానుకూలంగా స్పందించాలని వ్యాపారులు కోరారు. కిలో చికెన్‌పై రూ.40 మార్జిన్ ఇవ్వాలన్నారు. పౌల్ట్రీ కంపెనీలు ముందుకు రాకపోతే దుకాణాలు నిరవధిక బంద్ చేస్తామని హెచ్చరించారు. అప్పటికే స్పందించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు

అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

చర్చ తర్వాత అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్, వైఎస్సార్సీపీ, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు నేడు రాజ్యసభ ముందుకు రానుంది. ఆ తర్వాత కేంద్ర కేబినెట్ పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేసి అనంతరం రాష్ట్రపతి ఆమోదానికి పంపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

ప్రధాని మోదీకి, అమిత్‌షాకు కృతజ్ఞతలు: పెమ్మసాని

ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉంటుందా అన్న అనుమానానికి ఈ చట్టసవరణ ముగింపు పలుకుతుందని బిల్లుపై చర్చలో ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. అమరావతికి చట్టబద్ధత ఇచ్చేందుకు అంగీకరించిన ప్రధాని మోదీకి, అమిత్‌షాకు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి అనేది చంద్రబాబు ఆశయం, కల, ధ్యేయమని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్రాభివృద్ధిలో రాజధాని కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అమరావతి ఏపీ ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని నిర్ణయం, మార్పు కేంద్రం పరిధిలోనే ఉంటుందని 2022లో సుప్రీంకోర్టు చెప్పిందని పెమ్మసాని చంద్రశేఖర్ పునరుద్ఘాటించారు.

కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు

అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్లమెంటులో చర్చ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ అమరావతి చట్టబద్ధతకు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. అమరావతికి తగినన్ని నిధులు అందించి ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించేలా కేంద్రం సహకరించాలని కోరారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీ ఇంకా పెండింగ్‌లోనే ఉందని మాణికం ఠాగూర్ అన్నారు. మిగిలిన హామీలన్నీ అమలు చేసి విభజనతో నష్టపోయిన ఏపీని ఆదుకోవాలని కోరారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు జనసేన పార్టీ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి లోక్‌సభలో ప్రకటించారు. రాజధాని విషయంలో గత ప్రభుత్వం చాలా ఇబ్బందులు తెచ్చిందని గుర్తుచేసిన బాలశౌరి ప్రజల పూర్తి మద్దతున్న అమరావతిని శాశ్వత రాజధానిగా ఉంచాలని కోరారు. అసంబద్ధంగా జరిగిన విభజన వల్ల నవ్యాంధ్రప్రదేశ్‌కు తప్పనిసరి పరిస్థితుల్లో అమరావతి రాజధానిగా ఏర్పడిందని బీజేపీ ఎంపీ పురందేశ్వరి అన్నారు.

అమరావతి తెలుగు ప్రజల గుండె చప్పుడు

అమరావతి చట్టబద్ధత చట్టంతో ఆంధ్రప్రదేశ్‌లో ఇక మూడు ముక్కలాటలు సాగబోవని బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ఉద్ఘాటించారు. పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టాక చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. రాజధాని అనేది కొన్ని నిర్మాణాల సముదాయమో, ఒక నగరమో కాదని సీఎం రమేష్ అన్నారు. అమరావతి తెలుగు ప్రజల గుండె చప్పుడని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అమరావతిని నాశనం చేయడానికే పూనుకుని అదే పనిగా దుశ్చర్యలకు పాల్పడిందని ఎండగట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే 30 ఏళ్లూ ఎన్డీఏ కూటమి పాలనే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక ఎవరూ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదల్చలేరని కుండబద్దలు కొట్టారు.

వైఎస్సార్సీపీ ఎంపీలు లోక్‌సభ నుంచి వాకౌట్

అమరావతికి వ్యతిరేకం కాదంటూనే చట్టబద్ధత బిల్లును వైఎస్సార్సీపీ వ్యతిరేకించింది. ప్రస్తుత స్థితిలో ఉన్న బిల్లును వ్యతిరేకిస్తున్నామంటూ వైఎస్సార్సీపీ ఎంపీలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. అమరావతి చట్టబద్ధత బిల్లుతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఎంపీ మిథున్‌రెడ్డి విమర్శించారు. అమరావతి పేరుతో హడావుడిగా బిల్లు తెచ్చేస్తే సరిపోదని రైతులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

డిగ్రీ లెక్చరర్ పోస్టుల్లో అక్రమాలకు కుట్ర

మొదటిపేజీ తరువాయి

అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే జీవో నంబర్ 4 ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అడ్డంకిగా ఉన్న జీవోలను రద్దు చేయాలి

డీఎస్సీ కి జీవో నంబర్ 104, గ్రూప్స్ కు జీవో నంబర్ 29, పోలీసు ఉద్యోగాలకు జీవో నంబర్ 46, గురుకులాలకు జీవో నంబర్ 81, ఆడబిడ్డలకు రిజర్వేషన్లు రాకుండా జీవో నంబర్ 4 ను తెచ్చారని కవిత చెప్పారు. గత ప్రభుత్వం గానీ ఈ ప్రభుత్వం గానీ ఈ జీవోలను కనీసం సమీక్షించలేదని విమర్శించారు. దాదాపు 40 లక్షల కుటుంబాల్లో విద్యార్థులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంటే...ప్రభుత్వం మాత్రం వారికి న్యాయం చేసే విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇంత మంది కన్నీటి గాథలు ఇలా ఉంటే, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు ఆటలు ఆడుతుండటం సిగ్గుచేటన్నారు. మూసీ కి 7 వేల కోట్లు కేటాయిస్తూ రివ్యూ చేసే సమయం ఉన్న ప్రభుత్వానికి నిరుద్యోగులకు శాపంగా మారిన జీవో లపై సమీక్ష చేసే సమయం లేదా అని కవిత ప్రశ్నించారు. తెలంగాణ యువతను కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధికోసం వాడుకుందన్నారు. రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి లు చెబితే నమ్మరని రాహుల్ గాంధీతోనే నిరుద్యోగులకు హామీ ఇప్పించారని గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజు



రీయింబర్స్ మెంట్ బకాయిలు, అంగన్ వాడీ జీతాలు, గర్భిణులకు ఇచ్చే డబ్బులు, కిట్ లు కూడా ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిరుద్యోగుల సమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల వద్దకు వెళ్లి...ప్రభుత్వంపై పోరాటానికి వారిని సన్నద్ధం చేస్తామని హెచ్చరించారు.

రేషన్ కార్డులు ఏరి వేసే పైశాచికం మానేయాలి

రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కవిత ఆరోపించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు రేషన్ కార్డుల ఏరివేత కార్యక్రమం పెట్టుకుందన్నారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెబుతున్న ప్రభుత్వం ఏరివేత కార్యక్రమం ద్వారా 15 లక్షల రేషన్ కార్డులు తీసేయాలని చూస్తోందన్నారు. ఐటీ రిటర్న్స్ దాఖలు చేశారని, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారనే కారణంతో రేషన్ కార్డులు ఏరివేసే కుట్ర చేస్తున్నారని చెప్పారు. పేద ప్రజలకు మేలు చేసే రేషన్ కార్డుల విషయంలో పైశాచిక పనులను మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కొండగట్టు పనుల్లో ఇంత నిర్లక్ష్యమా?

కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడిన ఘటనపై కవిత విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన జయంతి వేడుకల కోసం నాసిరకంగా పందిళ్లు వేయడంతోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే కొండగట్టు అంజన్న ఆలయంలో ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించటంతో పాటు ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతిపక్షం
Prathipaksham.in

రాష్ట్రీయం

పెరిగిన ఆయిల్ పామ్ గెలల ధర

- రైతులలో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తిని పెంచే అవకాశం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్1: రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం కలిగించే దిశగా మరో సానుకూల పరిణామం చోటుచేసుకున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయిల్ పామ్ గెలల ధర పెరగడంతో రైతులకు ఆర్థికంగా లాభం చేకూరనుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు టన్నుకు రూ.21,546గా ఉన్న గెలల ధర, రూ.1,459 పెరిగి ప్రస్తుతం రూ.23,005కు చేరుకున్నట్లు తెలిపారు. ఈ ధరల పెరుగుదలతో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు మెరుగైన ఆదాయం లభించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ధరలు పెరగడం రైతుల్లో నమ్మకాన్ని పెంచుతుందని, భవిష్యత్తులో మరింత మంది రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ఇప్పటికే పలు చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. సాగు విస్తీర్ణం పెంపు కోసం ఉచితంగా మొక్కలను సరఫరా చేయడం, డ్రిప్ సౌకర్యం కల్పించడం మరియు ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ధరల పెరుగుదలతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తుందని అన్నారు. అయిల్ పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం అందించే పంటగా నిలుస్తోందని మంత్రి తెలిపారు. పెరిగిన ధరలతో రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి మరింత పెరిగి, రాష్ట్రంలో ఆయిల్ పామ్ విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయిల్ పామ్ సాగును విస్తరించుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, సాంకేతిక మార్గదర్శకాలు మరియు మద్దతు సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు.

హైదరాబాద్‌లో 10 టన్నుల కుళ్లిన మాంసం సీజ్

- సీఎం ఆదేశంతో రంగంలోకి పోలీసులు
- మంగళ్‌హాట్లోని రెండు గోదాములపై మెరుపు దాడులు
- చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, నిల్వ చేస్తున్నట్లు నిర్ధారణ
- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్ 1: ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్న కల్తీ రాయుళ్ల భరతం పడతామని, ఇందుకోసం ప్రత్యేకంగా నిఘా విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ కమిటీ హాల్లో నిర్వహించిన ఇష్టాగోష్టి సమావేశంలో వెల్లడించారు. సీఎం ప్రకటనతో రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ రాయుళ్ల భరతం పట్టేందుకు పోలీసులు, మరో పక్క ఫుడ్ సేఫ్టీ అధికారులు రంగంలోకి దిగారు. గత రెండు రోజులుగా హైదరాబాద్ నగరంలో విస్తృతంగా దాడులు చేస్తున్నారు. దీంతో ప్రజల ప్రాణాలను హరించే విధంగా లోపభూయిష్టంగా తయారు చేస్తున్న కల్తీ సరుకుల తయారీ దారుల ఇటకట్టిస్తున్నారు. బుధవారం నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, హెచ్‌ఫాస్ట్, జీహెచ్‌ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వఉంచిన భారీ మొత్తంలో ఈ కుళ్లిన మాంసం బయటపడింది. ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కుళ్లిన మాంసాన్ని నగరంలోని వివిధ హోటళ్లు, బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు మొత్తం నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోదాములను సీజ్ చేసిన అధికారులు.. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల నగరంలో వరుసగా బయటపడుతున్న ఇలాంటి కల్తీ దందాల పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట ఆహారం తినేటప్పుడు, మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు



పుదుచ్చేరిలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- కాంగ్రెస్ అభ్యర్థి వైద్యనాథన్ కు మద్దతుగా మంత్రి ప్రచారం

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్ 1: పుదుచ్చేరిలో ఈసారి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వం అని, ప్రజలంతా కాంగ్రెస్ వైపు ఉన్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పుదుచ్చేరిలోని లాస్పేట్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థి ఎం. వైద్యనాథన్‌కు మద్దతుగా మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ముకుల్, సిఎల్పీ నేత ఖాజా నిజాముద్దీన్ ,ఏఐసీసీ సెక్రటరీ అంజలి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. పుదుచ్చేరిలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. వైద్యనాథన్ ప్రజల మనిషి అని, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై మనకు అండగా ఉండే వ్యక్తి అని, వైద్యనాథన్ కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మీ సేవ కేంద్రాల్లో సర్వీసు ధరలు పెంపు

- జీవో జారీ చేసిన ప్రభుత్వం
- అన్ని సర్వీసులపై దాదాపు 50 శాతం ధరల పెంపు
- ఆదాయ, కుల, స్థానికత వంటి సర్టిఫికెట్ల జారీకి రూ.80
- జనన ధ్రువీకరణ పత్రం ప్రింట్ ఇవ్వడానికి రూ.62

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్1: మీ సేవ కేంద్రాల్లో సర్వీసు ధరలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని సేవలపై దాదాపు 50 శాతం ధరలు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు జీవోను విడుదల చేసింది. ఇకపై ఆదాయ, కుల, స్థానికత వంటి సర్టిఫికెట్ల జారీకి రూ.80 రుసుము వసూలు చేయనుంది. జనన ధ్రువీకరణపత్రం ప్రింట్ ఇవ్వడానికి రూ.62 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం సర్వీసుల ప్రాముఖ్యతను ఆధారంగా తీసుకుని వాటిని వివిధ కేటగిరీలుగా విభజించింది. గతంలో రూ. 35 నుంచి రూ. 45 మధ్య ఉన్న ప్రాథమిక ధృవీకరణ పత్రాల ధరను రూ. 62కు పెంచింది. మేజర్ సర్టిఫికెట్లు, ఇతర దరఖాస్తుల ధరను రూ. 45 నుంచి 60 ఏకంగా రూ. 80కి పెరిగింది. బయోమెట్రిక్, ఫార్మర్ రిజిస్ట్రీ, త్రైమాసిక పన్ను చెల్లింపు, కోర్టు కేసు సమాచార ఈకేవైసీ, ఆర్‌టీఏ డీఎల్ పేమెంట్ తదితరాల వంటి సేవల ధరలు కూడా రూ. 10, 20 నుంచి రూ. 18, 35 వరకు సవరించారు. మీ సేవ మొత్తం మూడు రకాల సేవలను అందిస్తోంది. వాటిలో కేటగిరి ఏ, కేటగిరి బీ, టాప్ బిల్ పేమెంట్స్‌గా వర్గీకరించారు. ఇకపై రెండు, మూడు రోజుల్లోనే : అధికారక నిబంధనల ప్రకారం మీ సేవలో పత్రాలు తీసుకోవాలంటే దరఖాస్తు చేసుకున్న ఏడురోజుల నుంచి 45 రోజుల పాటు వేచి చూడాల్సిందే.

కాంగ్రెస్ హయాంలో అధ్వాన్నంగా రహదారులు

- నిధుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం
- 25% నిధులు కూడా విడుదల చేయలేదు
- కేసీఆర్ హయాంలో 10,000 కి.మీ పైగా కొత్త రోడ్లు
- కాంగ్రెస్ హయాంలో కొత్తగా 112 కి.మీ మాత్రమే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్ , ఏప్రిల్ 1: తెలంగాణ రాష్ట్రంలో రహదారులు, వంతెనల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు మోకాళ్లలోతు గుంతలతో అధ్వాన్నంగా తయారయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండున్నరేళ్లలో రెండు వర్షాకాలాలు గడిచినా, దెబ్బతిన్న రోడ్లకు కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేయలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. దీనివల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. గత రెండు బడ్జెట్‌లో సుమారు 4800 కోట్ల రూపాయలు రోడ్ల కోసం కేటాయించామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకున్నా, వాస్తవానికి 25 శాతం నిధులు కూడా విడుదల చేయలేదని వేముల విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం 9 ఏండ్లలో రోడ్లు, వంతెనల అభివృద్ధి కొరకు సుమారు 25వేల కోట్లు నిధులు విడుదల చేశామని తెలిపారు. రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పాతవి , కొత్తవి కలిపి కేవలం 300 కిలోమీటర్ల పని మాత్రమే చేశారని అన్నారు.

అద్భుత కట్టడాలను గాలికి వదిశారు

అద్భుత కట్టడాలను ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ కక్షతో గాలికి వదిలేసిందని అన్నారు. తెలంగాణ సమాజం గర్వపడేలా నిర్మించిన సచివాలయ భవన మెయింటెనెన్స్ ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సచివాలయం ప్రారంభించి 3 ఏళ్లు కావస్తున్నా, ఇప్పటికి మెయింటెనెన్స్ కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ఐఐటి హైదరాబాద్, జేఎన్‌టీయూ వంటి సంస్థలు సూచించిన విధంగా ప్రతి ఆరు నెలలకోసారి చేయాల్సిన పీరియాడికల్ మెయింటెనెన్స్ కూడా ఆగిపోయిందని తెలిపారు. మెయింటెనెన్స్ లేక కట్టడం పాడైపోతే కేసీఆర్ పై, తనపై నింద వేయొచ్చనే కుట్రతోనే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ అమరవీరుల స్మారకార్థం, అమరజ్యోతిని కనీసం ఊడ్చే నాథుడే లేడని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలోనికి ప్రజలకు అందుబాటులోకి రాకుండా తాళాలు వేశారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను స్వయంగా ప్రభుత్వమే నాశనం చేయడం ప్రపంచంలో ఎక్కడా ఉండదని, ఇది తెలంగాణ సమాజం గమనిస్తోందని ఆయన హెచ్చరించారు.

పంచాయతీలకు ప్రతిష్టాత్మక అవార్డులు

- అభినందించిన మంత్రి సీతక్క



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్1: గ్రామీణాభివృద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరుస్తూ తెలంగాణ రాష్ట్రంలోని పలు పంచాయతీలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు కింద రాష్ట్రానికి చెందిన పంచాయతీలు అవార్డులు సాధించడం విశేషం. వికారాబాద్ జిల్లా పరిధిలోని కోటేపల్లి మండల పరిధిలోని మోతుకుపల్లి గ్రామ పంచాయతీ "గుడ్ గవర్నెన్స్" విభాగంలో అవార్డు సాధించింది. గ్రామ స్థాయిలో పారదర్శక పరిపాలన, ప్రజల భాగస్వామ్యం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చూపిన ప్రతిభకు గుర్తింపు లభించింది. అలాగే సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ "విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ" విభాగంలో జాతీయ అవార్డుకు ఎంపికైంది. మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన కృషి కి గాను ఈ అవార్డు దక్కింది. దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ముందంజలో ఉన్న పంచాయతీలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులు ప్రదానం చేస్తోంది. ఈ నేపథ్యంలో రెండు విభాగాల్లో తెలంగాణకు అవార్డులు రావడం పట్ల పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. "తెలంగాణ రాష్ట్రానికి చెందిన గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం గర్వకారణం. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన, మహిళా సాధికారత దిశగా మా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది నిదర్శనం. అవార్డులు అందుకున్న మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బందిని అభినందిస్తున్నాను. ఇలాంటి విజయాలు ఇతర పంచాయతీలకు స్ఫూర్తిగా నిలుస్తాయి " అని తెలిపారు.





అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్1: రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. నిన్న రాష్ట్రంలో కురిసిన వర్షాలతో వరి, మొక్కజొన్న, మామిడి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, కల్లాలకు తీసుకొచ్చిన మొక్కజొన్న, వరి కూడా తడిసి తీవ్రంగా నష్టం జరిగిందని సంఘం సభ్యులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ, వ్యవసాయ శాఖ నష్టాన్ని అంచనా వేసి వాణిజ్య పంటలకు ఎకరానికి 50 వేల రూపాయలు, ఆహార ధాన్యాలకు ఎకరాకు 25 వేల రూపాయలు పరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది.

మహిళా రైతుల రాష్ట్ర కన్వీనర్ గా కందాల ప్రమీల

మహిళా రైతుల రాష్ట్ర కన్వీనర్ గా కందాల ప్రమీల, కో కన్వీనర్లుగా శీలం పకీరమ్మ, కొప్పుల రజిత, చీరిక అలివేలు ఎన్నికయ్యారు. మరో 15 మంది సమ్మక్క, భూక్యా శ్రీదేవి, బొంతు సమత,ఉమ,ఊర్మిళ, గింజల లక్ష్మి, ఫైళ్ల భారతమ్మ,మోకు భవాని, బచ్చు శ్రీలత, నాగలక్ష్మి,అరుణ, రమాదేవి,బొబ్బ లక్ష్మి, పిట్టల సుభద్ర కమిటీ సభ్యులు గా ఎన్నికయ్యారు. మార్చి 31న యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో జరిగిన మహిళా రైతుల రాష్ట్ర సదస్సులో ఈ ఎన్నిక జరిగింది. ఈ సదస్సులో రైతులు, మహిళా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడం జరిగిందని రైతు సంఘం నేతలు తెలిపారు. ఏప్రిల్ 11న కిసాన్ సభ ఏర్పడి 90 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు సెమినార్లు నిర్వహించాలని, కేంద్ర ప్రభుత్వ కార్పోరేట్ అనుకూల విధానాలను ఎండగట్టాలని నిర్ణయం చేశారు. ఏప్రిల్ 13న జరుగు రైతుల ధర్నాలో మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



సొంతింటి కలను నెరవేర్చుతున్న కాంగ్రెస్

- హుస్నాబాద్ ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి

ప్రతిపక్షం, చిగురుమామిడి, ఏప్రిల్1: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చుతోందని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని గునుకులపల్లె గ్రామంలో ఇందిరమ్మ పథకం లబ్ధిదారు బరిగెల మమత రాజుల కొత్త ఇంటి గృహప్రవేశ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కంది తిరుపతి రెడ్డి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీలకతీతంగా పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవినీతి లేకుండా ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు విడుదల చేస్తోందన్నారు.లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. సొంతింటి కల నెరవేరడంతో తాము ఆనందంగా ఉన్నామని లబ్ధిదారులు తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, సర్పంచ్ గునుకుల మధుసూదన్ రెడ్డి, హౌసింగ్ ఏఈ విజయలక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పట్టాదారు హక్కులు కల్పించండి

- 60 ఏళ్ల సాగు.. హక్కులు లేవని రైతుల ఆవేదన
- ప్రభుత్వానికి రేకొండ గ్రామ రైతుల వినతి

ప్రతిపక్షం, చిగురుమామిడి, ఏప్రిల్1: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన సుమారు 120 ఎకరాల భూములను రికార్డుల్లో 'సీలింగ్ భూములు'గా చూపుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించి పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రభుత్వానికి రైతులు వినతి పత్రం సమర్పించారు. చిగురుమామిడి మండలం, రేకొండ గ్రామ పరిధిలోని ఈ భూములను పూర్వపు పట్టాదారులు వెలిమల రంగోపాల్‌రావు, వెలిమల మదన్‌మోహన్‌రావు కుటుంబ సభ్యుల నుంచి సుమారు 60 ఏళ్ల క్రితం నిరుపేద సన్నకారు రైతులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. కోర్టు డిక్రీలు, రిజిస్ట్రేషన్లు, సాదాబైనామాల ఆధారంగా కొనుగోలు చేసి దశాబ్దాలుగా సాగు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వ రికార్డుల్లో పొరపాటున 'సీలింగ్ భూములు'గా నమోదు కావడంతో పట్టాదారు హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. పట్టాదారు హక్కులు లేక రైతు బీమా, సబ్సిడీలు, బ్యాంకు రుణాలు వంటి ప్రభుత్వ ప్రయోజనాలు అందక ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపారు. సాగులో ఉన్న అసలైన రైతులకు వెంటనే పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేసి రికార్డుల్లోని పొరపాటును సరిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు.వినతిని స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి సమస్యను పరిశీలించి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.



తమిళనాడు ఎన్నికల్లో ఎన్డీయె గెలిస్తే రాష్ట్రం పేరును దక్షిణ ప్రదేశ్‌గా మారుస్తారు. ప్రజలు ఆ కూటమికి వ్యతిరేకంగా ఏకం కావాలి. బీజేపీ డమ్మీ ఇంజిన్ ముందు ద్రవిడ సూపర్ ఫాస్ట్ ఇంజిన్ ఎప్పటికీ తలవంచదు. దేశం మొత్తంలో తమిళనాడులోనే అధిక సంఖ్యలో మహిళలు పనిచేస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాదిరిగా ఇక్కడ అఘాయిత్యాలు జరగవు.

- తమిళనాడు సీఎం స్టాలిన్

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
గురువారం
02.04.2026
@prathipaksham
prathipakshamtvtelugu

కేరళలో ఐదు గ్యారంటీలు గట్టెక్కిస్తాయా

ఆరు గ్యారంటీలు ఇచ్చి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఇదే తరహా వ్యూహాన్ని కేరళంలోనూ అమలు చేస్తోంది. మలయాళీలకు ఐదు గ్యారంటీలను హస్తం పార్టీ ఆఫర్ చేస్తోంది. తెలంగాణ తరహాలోనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే అక్కడి బడ్జెట్ పరిమితులు, ప్రజల ఆలోచనా విధానాన్ని దృష్టిలో ఉంచుకొని మిగతా హామీల అమలు విషయంలో హస్తం పార్టీ ఆచితూచి వ్యవహరించింది.ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా.. ఏప్రిల్ 9న కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్‌కు కొద్ది రోజులే గడువు ఉండటంతో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈసారి కేరళంలో బీజేపీ కూడా బలంగా ప్రచారం చేస్తోంది. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో త్రిముఖ పోరు ఉండే అవకాశం ఉంది. అయితే చాలా చోట్ల మాత్రం పోటీ ప్రధానంగా అధికార ఎల్డీఎఫ్, ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమి యూడీఎఫ్ మధ్యే ఉండే అవకాశం ఉంటుందని అంచనా. గత పదేళ్లుగా కేరళలో అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తుండగా.. ఈసారి ఎలాగైనా మలయాళీల మనసు గెలవాలని హస్తం పార్టీ పట్టుదలతో ఉంది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ..ఇప్పుడు మలయాళ గడ్డ మీద పాగా వేయడం కోసం ఐదు గ్యారంటీలను సిద్ధం చేసింది. మహిళలు, యువతను తమవైపు తిప్పుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ హామీలను ఇచ్చింది.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని కేరళంలోనూ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇప్పటికే కర్ణాటక, తెలంగాణల్లో ఈ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే.కాలేజీలకు వెళ్తున్న అమ్మాయిలకు నెలకు రూ.1000 చొప్పున ఆర్థిక సాయం చేస్తామని కేరళంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. తెలంగాణలో ప్రతి మహిళకు నెలకు రూ.2500 చొప్పున ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ హామీ తెలంగాణలో ఇంకా అమలు కాలేదు. దీంతో కేరళంలో ఈ హామీని మార్చారని భావించొచ్చు.కేరళలో ప్రస్తుతం నెలకు రూ.2 వేల చొప్పున పెన్షన్లు ఇస్తుండగా.. దాన్ని రూ. 3 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. తెలంగాణలో ఫించన్లను రూ.4 వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే ఈ హామీ కూడా ఇంకా అమలు చేయలేదు.ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమాను అందిస్తామని కేరళ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ పథకానికి కేరళ మాజీ సీఎం ఉమెన్ చాందీ పేరు పెడతామని ఆ పార్టీ ప్రకటించింది. తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కారు ఆరోగ్య శ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచిన సంగతి తెలిసిందే.యువత వ్యాపారాలు చేసుకోవడానికి వీలుగా చిన్న వ్యాపారాల కోసం రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని కేరళ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వృద్ధుల సంక్షేమాన్ని పర్యవేక్షించడం కోసం ప్రత్యేకమైన మంత్రిని నియమిస్తామని కేరళ కాంగ్రెస్ ప్రకటించింది. రబ్బరు సాగు చేసే రైతులను ఆకట్టుకోవడం కోసం కిలో రబ్బరుకు రూ.250 చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని ఎకరానికి ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల ముంగిట హామీ ఇచ్చింది. అలాగే వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, వరికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని హస్తం పార్టీ హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడి సాయం 'రైతు భరోసా'ను ఎకరానికి రూ.12 వేలకు మాత్రమే పెంచింది. రూ.2 లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ హామీని దాదాపుగా నెరవేర్చింది.ఇందిరమ్మ ఇండ్లు పేరిట సొంత స్థలం ఉన్న పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని, గృహ జ్యోతి కింద ప్రతి కుటుంబానికి నెలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందిస్తామని తెలంగాణ ఎన్నికల ముంగిట హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ హామీలను అమలు చేస్తోంది. అలాగే పేద కుటుంబాలకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తామని తెలంగాణలో హస్తం పార్టీ హామీ ఇచ్చింది. మహిళలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఉచిత బస్సు ప్రయాణం హామీని ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఇచ్చింది. తెలంగాణకు వచ్చే ఆదాయం ఎక్కువ, ఇక్కడి బడ్జెట్ ఎక్కువ. సంక్షేమ పథకాలకు ఇక్కడ ప్రాధాన్యం ఎక్కువ. దీంతో సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణలో కాంగ్రెస్ హామీలు ఇచ్చింది. 202627 తెలంగాణ బడ్జెట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకే రూ.50 వేల కోట్లకుపైగా కేటాయించింది.కానీ కేరళం విషయానికి వస్తే.. ఆ రాష్ట్ర ఆదాయం తెలంగాణతో పోలిస్తే తక్కువ. అక్కడి ప్రజలు బాగా చదువుకున్నవారు. ఇప్పుడు అక్కడున్న ఉచిత పథకాలు కూడా తెలంగాణ స్థాయిలో లేవు. దీంతో అక్కడి పరిస్థితులకు తగ్గట్టుగా, మలయాళీలను ఆకట్టుకునేలా హామీలు ఇచ్చింది. తెలంగాణలో లాగే కేరళంలోనూ మహిళలు, యువతను తమవైపు తిప్పుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నం ఎంత మేర సక్సెస్ అవుతుందనేది మరి కొద్ది రోజుల్లోనే తేలనుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
02.04.2026

బడుగులకు భరోసానిచ్చిన బహుజన వీరుడు



ముక్కెర సంపత్ కుమార్
9959618206

మొఘలుల నిరంకుశ పాలనలో బిక్కుబిక్కుమమంటూ బతుకు ఈడుస్తున్న పేదా మధ్య తరగతి సామాన్య పౌరులకు బతుకు పైన ఆశ చూపి, ధైర్య సాహసాలు నూరిపోసి, పోరాట తత్వాన్ని నేర్పి, బహుజన రాజ్యాన్ని స్థాపించిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. ప్రస్తుత జనగామ జిల్లా రఘునాథపల్లి సమీపంలోని కిలాసాపురంలో క్రీ.శ. 1650లో నిరుపేద గౌడ కులానికి చెందిన సర్వమ్మ ధర్మన్నలకు పాపన్న జన్మించాడు.

తిరుగుబాటే ప్రథమ మార్గం:
పాపన్న చిన్నతనం నుంచి అన్యాయాలను ఎదిరించి ప్రశ్నించే తత్వం కలిగినవాడు. మొఘల్ రాజుల అండదండలతో గ్రామీణ స్థాయిలో ఉన్న పెత్తందారులు చేస్తున్న అరాచకాలను చూసి చలించిపోయాడు. నూనూగు మీసాల యవ్వనప్రాయంలోనే తన మిత్ర బృందంతో ఒక సైన్యాన్ని తయారు చేసుకున్నాడు. కుల మతాలకు అతీతంగా నిరుపేదలను, బడుగు బలహీన వర్గాల యువకులను తన సైన్యంలో చేర్చుకున్నాడు. జమీందారులు, భూస్వాముల ఇళ్లపై యుద్ధ తంత్రాలతో దాడి చేసి, ఆనాటి మొఘలాయి సైన్యాన్ని సైతం ముప్పు తిప్పలు పెట్టాడు. తన సైన్యంతో చాకచక్యంగా మెరుపు దాడులు చేసి, బొక్కసాలను ధ్వంసం చేశాడు. కిలాషాపూర్, తాటికొండ, హుస్నాబాద్, వేములకొండ వంటి అనేక ప్రాంతాల్లో కోటలు నిర్మించి పులిలా జీవించాడు. మరెన్నో ప్రాంతాలలోని కోటలను స్వాధీనం చేసుకొని తన సైనిక అవసరాలకు వినియోగించుకున్నాడు. గోల్కొండ లాంటి ప్రతిష్టాత్మకమైన కోటను కూడా జయించి కొంతకాలం తన స్వాధీనంలోకి తెచ్చుకోవడం ఆయన పోరాట పటిమకు ప్రబల నిదర్శనం.

వ్యవస్థతో పోరాటం:
నాటి పాలకుల దౌర్జన్యాలతో, భూస్వాములు పెత్తందారుల ఆగడాలతో సతమతమవుతున్న సామాన్యులకు స్వేచ్ఛను అందించడానికి పాపన్న నిరంతరం శ్రమించాడు. తన పోరాటాన్ని వ్యక్తుల మీద కాకుండా వ్యవస్థలోని వివిధ శక్తుల మీద చేశాడు. ఆనాటి పాలకులకు కొరకరాని కొయ్యగా తయారయ్యాడు. మెరుపు దాడులతో వారిని భయభ్రాంతులకు గురి చేసేవాడు. ఔరంగజేబు మరణం తర్వాత సింహాసనాన్ని అధిష్టించిన బహదూర్ షా పాపన్నను మట్టు పెట్టడానికి పలుమార్లు ప్రయత్నించాడు. నాటి హైదరాబాద్ సుబేదార్ ముబారిజ్ ఖాన్ ఆయన పైకి భారీ సైన్యంతో దండెత్తి వచ్చాడు. అది కీలకమైన పోరు. పాపన్న గోల్కొండ స్వాధీనం చేసుకోవడం మొఘల్ పాలకులు తీవ్ర అవమానంగా భావించారు. పాపన్న పీడ వదిలించుకోవడం కోసం ఢిల్లీ నుంచి దిల్ ఖాన్, ఖాసీం ఖాన్ వంటి నిష్ణాతులైన సైన్యాధికారులను పంపించారు. కానీ వారి పన్నాగాలు పాపన్నను ఏమీ చేయలేకపోయాయి. ఖిలా షాపురం కేంద్రంగా వీరోచిత పోరాటాలు చేశాడు. బహుజనులు ఆత్మాభిమానంతో బతికేందుకు భూస్వాముల పై గెరిల్లా యుద్ధం సాగించాడు.

హుస్నాబాద్ తో అనుబంధం:
పాపన్న తన గెరిల్లా యుద్ధ తంత్రాల కోసం శత్రు దుర్భేద్యంగా ఉండే ఎత్తైన గుట్టలను ఎంచుకునేవాడు. అందుకే తెలంగాణలోని అనేక గుట్టల ప్రాంతాల్లో ఆయన స్థావరాలు ఉన్నట్లు తెలుస్తోంది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సమీపంలోని బయన్న గుట్టలపై సైతం పాపన్న అద్భుతమైన కోటను నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయి. ఈ గుట్టల సమీపంలో ఒక గ్రామాన్ని ఇప్పటికీ సర్వాయిపేట



(కరీంనగర్ జిల్లా, సైదాపూర్ మండలంలో) అని వాడుకలో ఉంది. ఆ గ్రామంలో కూడా పాపన్న ఆనాడే విశాలమైన కోటను నిర్మించాడు. ఆ కోట నుండి గుట్ట పైన ఉండే కోటకి సొరంగ మార్గం ఉందని స్థానికులు చెప్తుంటారు. బయన్న గుట్టలు శత్రువుల కదలికలు గమనించటానికి, స్వీయ రక్షణకు అనువుగా ఉంటాయని ఇక్కడ కోటను నిర్మించాడు. కోటకి వెళ్లే దారిలో ఏకశిలపై 10అడుగుల భైరవ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించి నిత్యం పూజలు చేసేవాడట. ఇప్పటికీ గుట్టలపై ఆనాటి కోట గోడ, బురుజులు, కొలనులు మరెన్నో ఇతర నిర్మాణాలు కనిపిస్తూనే ఉన్నాయి. ఇలా బయన్న గుట్టలు కేవలం చారిత్రక ఆధారాలు గానే కాకుండా ఒక సాహస వీరుని పోరాట పటిమకు సజీవ సాక్షాలుగా ఉన్నాయి. ఈ పరిసర ప్రాంతాలైన అక్కన్నపేట, కోహెడ తదితర గ్రామాలలో ఆనాడు పాపన్న ప్రభావం ప్రభలంగా ఉండేదని చెప్తుంటారు.

బహుజన రాజ్యం:
రాజ్యాధికారం నిరంతరం సంపన్న వర్గాలకే కాకుండా సామాన్యులకు కూడా అందాలని ఆనాడే ఆకాంక్షించిన ఆదర్శనీయుడు పాపన్న. పుట్టుకతోనే ఎవరూ పాలకులు కారని, కార్యక్రమంలో వారిలోని ప్రతిభ పాటవాలు సింహాసనాన్ని అధిరోహించే అవకాశాన్ని కల్పిస్తాయని ఆయన విశ్వసించేవాడు. పెత్తందారుల కబంధ హస్తాల్లో రాజ్యం ధనవంతులకే వీరభోజ్యం అవుతుందని, అగ్రవర్ణ ఆధిపత్యపూరులో సామాన్యులు నిరంతరం సమిధలుగా మారుతున్నారని ఆవేదన చెందాడు. అందుకే తన జీవితాంతం సామాన్యులకు సహాయకారిగా జీవించాడు. నిర్బంధ పన్నుల వసూళ్లను అడ్డుకున్నాడు. సంపన్నుల నుండి ధనాన్ని దోచుకొని తెచ్చి, పేదలకు పంచిపెట్టాడు. నియంతృత్వ పాలకుల కబంధ హస్తాల నుండి దేశాన్ని విముక్తి చేసి బహుజన రాజ్యాన్ని స్థాపించాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు. అందుకే ఈనాడు ఆయనను దక్షిణ భారత రాబిన్ హుడ్ అని గౌరవిస్తున్నాం. తేది: 02.04.1710 నాడు ఆయనను ఉరి తీసిన అనంతరం ఇతర విప్లవకారులను భయపెట్టడానికి ఆనాటి పాలకులు ఆయన తలను నరికి గోల్కొండ కోటకు వేలాడదీశారు. కానీ ఈ సంఘటన ప్రజల్లో భయాన్ని కాకుండా ఆయన పట్ల మరింత గౌరవాన్ని పోరాట స్ఫూర్తిని నింపింది. ఆయన సాహసాన్ని ఊరూరా కథలు కథలుగా జానపద బాణీలలో పాడుకొని ధైర్యాన్ని కూడగట్టుకున్నారు.

ప్రభుత్వాల ప్రోత్సాహం:
ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోయాక, తెలంగాణలో సర్దార్ సర్వాయి పాపన్న లాంటి సాహస వీరులకు తగిన గుర్తింపే లభించింది అని చెప్పుకోవచ్చు. 17వ శతాబ్దం నాటి ఆయన ఈరోజుతో పోరాటాలను పాలకులు స్మరిస్తూనే ఉన్నారు. జయంతి వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తూ, బహుజన చక్రవర్తిగా కీర్తిస్తూ ఈనాటి యువతరానికి ఇకపోతే చేస్తున్నారు. గత పాలకులు ఆయన స్వగ్రామం ఖిలా షాపురంలో కోట పునర్నిర్మాణం చేపట్టారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ నేతృత్వంలో సర్వాయి పాపన్న గుట్టలకు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నది. గత సంవత్సరం ఐదు కోట్ల నిధులతో సైదాపూర్ మండలం సర్వాయిపేట పరిసర ప్రాంతాల్లోని కొమ్ముగుట్ట వద్ద సర్దార్ సర్వాయి పాపన్న 20అడుగుల భారీ విగ్రహం నిర్మిస్తున్నారు. అక్కడే ఒక ఆడిటోరియం నిర్మించడంతోపాటు, దీనిని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతున్నారు.

(నేడు సర్వాయి పాపన్న వర్ధంతి)

(వ్యాసకర్త.. ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

కవిత పార్టీతో గులాబీలకు గుబులు



డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్
8886666006



తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు పూర్తిగా వేసవి రాకముందే వేడెక్కాయి. ఏప్రిల్ రాజకీయ మంటలు కొన్ని ప్రధాన పార్టీలను, ఉక్కపోత సెగను కల్గిస్తున్నాయి. లోలోపల అంతర్మథనం చెందుతూనే మొఖం వాడి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఆడపిల్లే కదా ఏం చేస్తది లే అనే చులకన భావం.. వారు కలిగించిన మానసిక క్షోభ, కల్వకుంట్ల కవితను ఇంక గట్టి దాన్ని చేశాయి. మహిళ అనే వివక్షతో తన వ్యక్తిత్వాన్ని సైతం ఇబ్బంది పెట్టే విధంగా, చులకనగా చూసి పూర్తిగా కవిత ఆత్మగౌరవానికి ఇంటి మనుషులే భంగం కలిగించారు. ఎక్కడైతే అవమానానికి గురి అవుతామో, ఎక్కడైతే వివక్షకు లోనవుతామో, ఎక్కడైతే సామాన్యుల మాన ప్రాణాలను దోచుకుంటారో అక్కడ తిరుగుబాటు ఉద్భవిస్తుంది అన్న మాటలు కవిత విషయంలో అక్షర సత్యం అయ్యింది. అలాంటి విప్లవాత్మకమైన రాజకీయం ప్రారంభించింది కవిత. తను రాజకీయాల్లో క్రియాశీలకమైన నాయకురాలు. నాడు కేంద్రం కుట్రలు చేసి కేసీఆర్ పైన ఉన్న కోపంతో చేయని నేరం మోపి ఐదున్నర నెలలు జైలుకు పంపినా మొండి ధైర్యంతో పార్టీ కోసం భరించి త్యాగం చేసింది కవిత. త్యాగం ఒకరిదైతే ఆ పార్టీలో భోగం ఇంకొకరిది. కాసే చెట్టుకే రాళ్ల దెబ్బలు అన్నట్టుగా మౌనంగా భరిస్తుంది అని నూతిన పడ్డ వాడి మీద నూరు రాళ్లు వేసినట్టు పని గట్టుకొని నిందలు ప్రచారం చేసి నాడు శూనక ఆనందం పొందారు. ప్రజలు తిరస్కరించి ఓడగొట్టినా బీఆర్ఎస్ పార్టీకి ఒక బాధ్యత కలిగిన నాయకురాలిగా కిందిస్థాయిలో కోరుకుంటున్న మార్పులను, ఉద్యమకారులు, మహిళలు ద్వితీయ శ్రేణి నాయకుల నుండి వస్తున్న వాదనలను వినిపించి ప్రశ్నించినందుకు కుట్రలతో బలవంతంగా బయటకు పంపించేశారు. వారు చేసిన కర్మనే కాలసర్పమై బీఆర్ఎస్ ను కాటేస్తున్నది. ఎంతగా తనను సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని ఇంటి మనుషులే దుష్ప్రచారం చేశారు. న్యాయ స్థానాలమీద, భగవంతుడు మీద భారం వేసి సత్యం గెలుస్తుంది అని కవిత నమ్మారు. తాను భావించినట్టే ఢిల్లీ లిక్కర్ కేసులో నిర్దోషిగా కడిగిన ముత్యంలా బయటకు వచ్చారు కవిత. ఈ తీర్పుతో ఖంగు తిన్నవారు తన సంతోషాన్ని ఒక అయిదు నిముషాలు కూడా మిగల్చకుండా మేము ముందే చెప్పినం అని సన్నాయి నొక్కులు నొక్కుతూ అసెంబ్లీ ఎన్నికల ఓటమిని కవిత మెడలో వేసే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ నాయకత్వాన్ని చూసిన తెలంగాణ సమాజం విస్మయానికి గురి అయ్యింది. వారి చేతకాని తనాన్ని అసమర్థతను, ఒక ఆడబిడ్డ పైన రుద్దటాన్ని చూసి జనం అసహ్యించుకున్నారు. కవిత కూడా అంతే స్థాయిలో బదులు ఇవ్వటం తో బీఆర్ఎస్ నాయకత్వం తోక ముడిచింది.

మరి కవితకు ఉన్నదేంటి
కవితకు ఉన్నది ఏమిటి, ఏం చూసుకొని ఇంతటి దూకుడు రాజకీయాలు చేస్తున్నదంటే కవితకు ఉన్నది ధైర్యం.. కవితకు ఉన్నది కేసీఆర్ కు మించిన వజ్ర సంకల్పం. పట్టుకుంటే వదలని తత్వం.. ఆ పట్టుదలకు, కార్యసిద్ధికి, ఆమె సత్వరం తీసుకునే నిర్ణయాలు, సమస్య తీర్చేదాకా సంకల్పసిద్ధితో, చిత్తశుద్ధితో పోరాటం చేయటం ఆమెకు తండ్రి నుంచి వచ్చిన వారసత్వం. మొన్న మన రాష్ట్రంలో వెలుగుమట్ల పేదల ఇండ్లను కూల్చితే, పరామర్శించి పరిస్థితి తెలుసుకోవటం కోసం పోయిన కవిత, అక్కడ వారి సమస్యను చూసి చలించారు. ఆమె ఇంతటి అన్యాయాన్ని భరించలేక పోయింది. భీష్మించుకు కూర్చుంది. 70 ఏండ్ల చరిత్ర లో అంతటి ర్యాలీ అక్కడ వామపక్షాలు ఉన్నా జరగలేదు. అంతటి ర్యాలీ ధర్మ సమాజ్ పార్టీ, జాగృతి ఆధ్వర్యంలో జరిపి, పోలీసులు అడ్డుకొని అడుగడుగునా హింసిస్తుంటే నిద్రాహారాలు మానుకొని డాక్టర్ విశారదన్ మహారాజ్ తో కలిసి నిరవధిక నిరాహార దీక్ష చేసి ప్రభుత్వం మెడలు వంచి ఆ పేదలకు పట్టాలు ఇప్పించిన ఉక్కు సంకల్పం కవితది. సమస్య ఏదైనా కావొచ్చు.. సమస్య ఉంటే వాలిపోయే తత్వం ఆమెది. ఈ పట్టు విడుపులు కింది స్థాయి వరకు వెళ్లే ఆ తెగింపును గమనించిన అనేక కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ప్రజా స్వామిక వాదులు, తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు కవిత నాయకత్వాన్ని మెచ్చి కలసి వస్తున్నారు. ఉదాహరణకు బీసీ ఉద్యమాన్ని చైతన్యవంతంగా నడిపిన ఆర్ కృష్ణయ్య లాంటి పెద్ద మనిషి, డాక్టర్ విశారదన్ మహారాజ్, తెలంగాణ జర్నలిస్ట్ విఠల్, ఇలా అనేక మంది మద్దతుగా నిలుస్తున్నారు. ఆది కవితకున్న నాయకత్వ పటిమ. కవితకు బీజేపి, బీఆర్ఎస్, కాంగ్రెస్ లను తట్టుకొనె సామర్థ్యం ఉందా సామర్థ్యం అనేది పోరాటంలో ప్రజా సమస్యలు పరిష్కరించటంలో ఉండాలి అని బలంగా నమ్ముతుంది కవిత. వందల ఏండ్ల చరిత్ర కలిగిన పార్టీలైనా, సిల్వర్ జూబ్లీలు చేసుకున్న పార్టీలైనా ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తే కాలగర్భంలో కలసి పోవటం ఖాయం. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఈ ప్రాంతం నుండి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ నుండి ఎనమిది మంది ఎంపీలు ఉన్నా తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టడం తప్ప రాష్ట్రానికి చిల్లిగవ్వ తీసుకరాలేని అసమర్థులుగా ప్రజల ముందు నిలబడ్డారు. ఇక జాతీయ రాజకీయాల్లో ఉద్దరిస్తామంటూ తెలంగాణ పదాన్నే తన పేరునుండి తొలగించుకున్న బీఆర్ఎస్ పార్టీ పర్ఫార్మెన్స్ మరచి నిద్ర పోతున్నది. ఈ సమయంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో బలమైన ప్రాంతీయ పార్టీ అవశ్యకత కీలకం. ఆ పాత్ర కల్వకుంట్ల కవిత పెట్టబోయే పార్టీ ద్వారా ఫుల్ ఫిల్ అవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. తమిళనాడులో ద్రావిడ సిద్ధాంతాలకు, తమిళ జాతీయ వాదం, అంబేద్కర్, పెరియార్, కామరాజ్ లాంటి మహనీయుల సైద్ధాంతిక అనుబంధంతో మధ్య వామపక్షంగా ఇటీవల సినిమా స్టార్ విజయ్ తమిళగ వెట్రి కజగం (టీవీకే) అనే పార్టీని స్థాపించారు. 90 స్థానాలతో పాటు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ఎన్డీఏ సంప్రదించినా ఢిల్లీ పెద్దలకు మోకారిల్లేది లేదని తిరస్కరించారు విజయ్. అలాంటి స్వభావం కవితలో కూడా స్పష్టంగా కనిపిస్తున్నది. వివిధ జాతీయ పార్టీలకు బీ టీమ్ కవిత పెట్టే పార్టీ అని ప్రజల్లో తప్పుడు సాంకేతలు పంపుతున్నది బీఆర్ఎస్ పార్టీ. కవిత పెట్టే పార్టీతో బీఆర్ఎస్ కు నష్టం లేనప్పుడు ఈ తప్పుడు మాటలు, ఆధారాలు లేని మాటలు బీఆర్ఎస్ ఎందుకు ప్రచారం చేస్తున్నది. అంటే కవిత పెట్టే పార్టీతో వారికి ఎంత ప్రమాదమో ఇప్పటికే ఒక క్లారిటీ ఉంది. అయినా ఉద్దెర మాటలు మాట్లాడక తప్పని పరిస్థితి బీఆర్ఎస్ పార్టీది.

కేంద్రంపైనా యుద్ధమే
నేను ఎవరో ఆపరేట్ చేస్తే నడిచే ఉపగ్రహాన్ని కాదు అని అనేకసార్లు నొక్కి చెప్పినా ఇంకా ఆడబిడ్డ మీద ఇవే దిగజారుడు బురద చల్లే మాటలే మాట్లాడుతున్నారు. కవిత ఈ రాష్ట్రం లో రేవంత్ రెడ్డి సర్కార్ చేస్తున్న ఆరాచక పాలనను ప్రశ్నిస్తూ, పోరాటాలు చేస్తూ ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా తయారయ్యారు. ప్రభుత్వాన్ని నిత్యం ఇరకాటంలో పెడుతున్నారు. తెలంగాణపైన చూపెడుతున్న వివక్షను, బడ్జెట్ లో నిధులు ఇవ్వకపోవటాన్ని, మహిళ బిల్లు పెడితే సబ్ కోటాతో బిల్లు పెట్టాలని లేకపోతే మళ్ళీ ఉద్యమిస్తానని కేంద్ర ప్రభుత్వాన్ని కూడా హెచ్చరిస్తూ వస్తున్నారు కవిత. పౌరసత్వ సవరణ చట్టాన్ని, నీట్ పరీక్ష విధానాన్ని, హిందీని బలవంతంగా రుద్దటాన్ని, విద్యను ఉమ్మడి జాబితానుండి రాష్ట్ర జాబితాలోకి మార్చటానికి, కార్మికులు హక్కులకు భంగం కలిగించే లేబర్ కొడ్స్ రద్దు కోసం ఆది నుండి కవిత కేంద్రాన్ని కూడా ప్రశ్నిస్తూ వస్తున్నారు. కాబట్టి తాను పెట్టే పార్టీ ఏ కులానికో, ఏ మతానికో సంబంధించినది కాదు.. సెక్యులర్ భావాలతో అన్ని వర్గాల సంక్షేమ సారథిగా నడవనున్నారు కవిత. మహాత్మా గాంధీ కలలు కన్న సర్వోదయ సిద్ధాంతం ప్రకారం సర్వోదయ తెలంగాణ కావాలని అలా తీర్చి దిద్దటమే తన పార్టీ లక్ష్యంగా కనిపిస్తున్నది.

జాతీయస్థాయి సంబంధాలతో తెలంగాణకు ప్రయోజనం
సామాజిక న్యాయం, లౌకిక వాదం, సమానత్వం, జవాబుదారి తనం, పారదర్శకత, అవినీతి రహిత తెలంగాణ, యువత, మహిళ, దళిత బహుజనులు, మైనారిటీ వర్గాలకు పెద్ద పీట వేసి తెలంగాణ రాజకీయాల్లో సంచలన మార్పు దిశగా ఏప్రిల్ 25న పార్టీ ప్రకటన ఉంటుందని తెలంగాణ సమాజం ఎదురు చూస్తున్నది. జాతీయస్థాయిలో కవితకు ఉన్న సంబంధాలు, బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావు లకు సైతం లేవు అన్నది సుస్పష్టం. నాడు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్నప్పుడు కేసీఆర్ తో సోనియా గాంధీ సమావేశం ఏర్పాటు చేయించారు. సోనియా గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వని పరిస్థితి ఉన్న ఆ సమయంలో కవిత చాలా క్రియాశీల పాత్రను పోషించారు. నాటి కేంద్ర ట్రాన్స్‌పోర్ట్ మినిస్టర్ ఆస్కార్ ఫర్నేండేజ్ తో మాట్లాడి సోనియా గాంధీతో కేసీఆర్ మీటింగ్ ఏర్పాటు చేయించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగుమం చేసిన గొప్ప కార్యోన్ముఖురాలు కవిత. మహిళా బిల్లు విషయంలో ఢిల్లీ వేదికగా పోరాడి జాతీయ స్థాయి మద్దతు కూడగట్టింది. ఇలా జాతీయ స్థాయిలో ఉన్న సంబంధాలు రేపటి తెలంగాణ భవిష్యత్తుకు ప్రయోజనకరంగా మారనున్నాయి. మొత్తంగా కవిత ఇష్యు బేస్డ్ రాజకీయాలను చేస్తూ సర్వోదయ తెలంగాణ కోసం నడుము బిగించి కదులుతున్నది. అన్ని పార్టీల్లో ఒక అలజడి మొదలైంది. ముఖ్యంగా బీఆర్ఎస్ లో కలవరం అంతా ఇంతా కాదనే చెప్పాలి. ఎక్కడైతే పోగొట్టుకున్నామో అక్కడే సాధించుకోవాలన్న నానుడిని బలంగా నమ్ముతున్నది కవిత. ఇంత కాలం బీఆర్ఎస్ ను మోసిన ఉద్యమకారులు కవిత పార్టీ వైపు మొగ్గుతున్నారు. మరోవైపు మహిళలు కవిత నాయకత్వాన్ని విశ్వసిస్తున్నారు. ఇదే జరిగితే కవిత పార్టీ ప్రభంజనం సృష్టించటం ఖాయంగా కనిపిస్తున్నది.

(వ్యాస కర్త తెలంగాణ జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008



రాజకీయం

వికారాబాద్‌లో భూసేకరణపై రైతుల ఆగ్రహం

- జాగృతి, ధర్మ సమాజ్ పార్టీల నేతల సంఘీభావం



ప్రతిపక్షం, వికారాబాద్, ఏప్రిల్ 1: వికారాబాద్ జిల్లా పరిగి మండలం కద్దాపూర్ గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం చేపట్టిన భూసేకరణను రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమ జీవనాధారం అయిన సారవంతమైన భూములను కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేస్తుండగా, కల్వకుంట్ల కవిత ఆదేశాలతో జాగృతి నాయకులు రైతుల దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం కద్దాపూర్ గ్రామంలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ కోసం ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణపై స్థానిక రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 509.18 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించగా, దీనికి సంబంధించి రైతులకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ భూములే తమ కుటుంబాలకు ఏకైక జీవనాధారం అని రైతులు పేర్కొంటూ, భూములు కోల్పోతే తమ జీవితం తీవ్ర సంక్షోభంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో పరిసర ప్రాంతాల్లో నీటి, గాలి కాలుష్యం పెరిగే అవకాశం ఉందని, దాని ప్రభావం గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణంపై పడుతుందని రైతులు హెచ్చరిస్తున్నారు. ప్రాజెక్ట్ అమలుకు ముందు అవసరమైన సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ సక్రమంగా నిర్వహించలేదని వారు ఆరోపిస్తున్నారు. అలాగే సారవంతమైన భూములను కాకుండా సమీపంలోని బంజరు లేదా సాగుకు అనర్హమైన భూములను ఈ ప్రాజెక్ట్ కోసం పరిశీలించాలని ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో కద్దాపూర్ గ్రామ ప్రజలు తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని భూ సేకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, తెలంగాణ జాగృతి జాగృతి నాయకులు రైతుల దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను వినిపించుకుని వారికి మద్దతుగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశాధరన్, జాగృతి రాష్ట్ర కార్యదర్శి భవానీ వేముల, నరేష్ ప్రజాపతి , కోలా శ్రీనివాస్, వరకుప్పల సుధాకర్, సీమ రమేష్, ఎస్. ప్రసాద్, ముస్తఫా పాల్గొన్నారు.



ఘనంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రతిపక్షం, హుస్నాబాద్, ఏప్రిల్ 1: రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ జన్మదిన వేడుకలను హుస్నాబాద్ లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం నాడు మంత్రి లక్ష్మణ్ 57వ జన్మదిన ఉత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జన జాగృతి కళా సమితి కార్యాలయంలో పలువురు మాదిగ సంఘ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కౌన్సిలర్ గాదపాక రవీందర్ మాట్లాడుతూ మాదిగలు ఏ పార్టీలో ఉన్నా తమ ఉనికిని కాపాడుకోవాలని అన్నారు. హుందాగా నడుచుకుంటూ అనేక పదవులను అలంకరించాలని అన్నారు. రాజకీయ ప్రయోజనాల రీత్యా ఎవరు ఏ పార్టీలో ఉన్నా మాదిగలుగా అందరం ఐక్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన జాగృతి అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్, దళిత రత్న అవార్డు గ్రహీత కొమ్ముల సంపత్, నాయకులు గసికంటి హరికిషన్, అర్షం జనార్ధన్, గడిపె సింగరి, కొమ్ముల శ్రీనివాస్, కాదాసు నగేష్, జేరిపోతుల కిరణ్, మాచర్ల ఐలేష్ తదితరులు పాల్గొన్నారు



కొత్త రోడ్డు వేశారు.. స్పీడ్ బ్రేకర్లు మరిచారు

- అతి వేగంతో తరచూ ప్రమాదాలు
- గాయలపావుతున్న వాహనదారులు

ప్రతిపక్షం షాద్ నగర్, ఏప్రిల్ 1: షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణ థియేటర్ నుంచి కుంట బడి మీదుగా పాత జాతీయ రహదారి వరకు గత మూడు నెలల క్రితం నూతనంగా సీసీ రోడ్డు వేశారు. రోడ్డును గతంలో కన్నా విస్తరించి వేయడంతో విశాలంగా మారింది. ఇంతవరకు బాగానే ఉంది. ఇంత విశాలమైన రోడ్డు వేసినా స్పీడ్ బ్రేకర్లు వేయడం మరిచారు. ఈ రోడ్డుకు పలు కాలనీల రోడ్లు అనుసంధానంగా ఉన్నాయి. ఈ రోడ్డును బైపాస్ రోడ్డుగా కూడా పిలుస్తుంటారు. చౌరస్తా మీదుగా వెళితే పోలీసులు పట్టుకుంటారనే భయంతో వందలాది వాహనాల వారు ఈ రోడ్డు గుండా వెళుతుంటారు. అయితే రోడ్డు బాగు పడడంతో వాహనదారులు అతి వేగంగా వెళుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కాలేజీ రోడ్డు తరువాత అతి పెద్దదైన ఈ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ల ప్రాముఖ్యత ఎంతగానో ఉంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన స్పీడ్ బ్రేకర్లు వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఆర్కేపురం డివిజన్ లో బీజేపీకి ఎదురు దెబ్బ

- కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన కమలం నేతలు

ప్రతిపక్షం, మహేశ్వరం, ఏప్రిల్ 1: మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ లో బీజేపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో బీజేపీ అసెంబ్లీ ఓబీసీ కన్వీనర్, మాజీ వార్డు మెంబర్ రమేష్ గౌడ్, డివిజన్ జనరల్ సెక్రటరీ సుదర్శన్, ఎన్టీఆర్ నగర్ ఫేస్ 2 అధ్యక్షులు రవి సహా పలువురు కాంగ్రెస్ లో చేరారు.ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలో ఆహ్వానించారు. పాత వారిని గౌరవిస్తూ కొత్తగా పార్టీలో చేరిన వారికీ సముచిత స్థానం కల్పిస్తామని కిచ్చెన్న హామీ ఇచ్చారు. వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే అఖండ విజయం సాధిస్తారని లక్ష్మారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బీజేపీకి సరైన నాయకత్వం లేకపోవటం, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కొత్తగా పార్టీలో చేరిన నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పున్నా గణేష్ నేత, చిలుక ఉపేందర్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

మూర్తుజగూడలో వ్యక్తి ఆత్మహత్య

- మద్యం మత్తులో ప్రాణాలు తీసుకున్న కూలీ

ప్రతిపక్షం,మొయినాబాద్, ఏప్రిల్ 1: మండల పరిధిలోని మూర్తుజగూడ గ్రామంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా, దీవెంకపాల్ గ్రామానికి చెందిన కుందల ఈశ్వరరావు (50), తన భార్య సుబ్బలక్ష్మితో కలిసి 20 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం మొయినాబాద్‌కు వలస వచ్చారు. వీరు మూర్తుజగూడలోని మిరాజ్ అహ్మద్‌కు చెందిన మామిడి తోటలో కూలీలుగా పని చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. గత నెల 29న పని నిమిత్తం సుబ్బలక్ష్మి తన సొంత గ్రామానికి వెళ్లగా, ఈశ్వరరావు ఇంట్లోనే ఒంటరిగా ఉన్నాడు. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో ఆమె తిరిగి వచ్చేసరికి భర్త ఇంట్లో కనిపించలేదు. తోటలో వెతకగా, సమీపంలోని ఒక నేరేడు చెట్టుకు ఈశ్వరరావు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కిందకు దించారు.

మద్యం మత్తులో?

మృతుడు ఈశ్వరరావుకు మద్యపాన అలవాటు ఉందని, భార్య లేని సమయంలో అధికంగా మద్యం సేవించేవాడని సమాచారం. మద్యం మత్తులోనే అతను ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని భార్య పోలీసులకు తెలిపింది. తన భర్త మరణంపై ఎటువంటి అనుమానాలు లేవని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



నేడు సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

- మొయినాబాద్ మండలంలో ఘనంగా ఏర్పాట్లు

ప్రతిపక్షం, మొయినాబాద్, ఏప్రిల్ 1: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను పురస్కరించుకుని మొయినాబాద్ మండల వ్యాప్తంగా ఘనంగా నివాళులర్పించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల గౌడ సంఘం అధ్యక్షులు బసవపురం అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. గురువారం ఉదయం 9:00 గంటల లోపు మండలంలోని ప్రతి గ్రామంలో గౌడ బంధువులు పాపన్న గౌడ్ విగ్రహాలకు లేదా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించాలని సంఘం నిర్ణయించింది. గ్రామ స్థాయిలో కార్యక్రమాలను విజయవంతం చేయాలని గౌడ బాంధవులకు పిలుపునిచ్చారు.గ్రామాల్లో కార్యక్రమాలు ముగిసిన అనంతరం, సరిగ్గా ఉదయం 10:00 గంటలకు మొయినాబాద్ మండల చౌరస్తాలో ప్రధాన వర్ధంతి వేడుక నిర్వహించనున్నారు. "బహుజన ఆత్మగౌరవ ప్రతీక పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మన లక్ష్యం" అని అంజయ్య గౌడ్ పేర్కొన్నారు. ఈ ప్రధాన కార్యక్రమానికి మండలంలోని గౌడ సోదరులందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



అందెల శ్రీరాములు నివాసానికి త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి రాక

ప్రతిపక్షం, మహేశ్వరం, ఏప్రిల్ 1: త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి పర్యటనలో భాగంగా బుధవారం మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు నివాసానికి విచ్చేసిన సందర్భంగా శ్రీరాములు నియోజకవర్గ బిజెపి నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి శ్రీరాములు తో కాసేపు ముచ్చటించి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఇంటలెక్చువల్ సెల్ కన్వీనర్ గంగాపురం వెంకట్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు శంకర్ రెడ్డి, కడారి జంగయ్య యాదవ్, వీరన్నగారి ధీరజ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణ్ ముదిరాజ్, జిల్లా మీడియా కన్వీనర్ మల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచ్లు, వివిధ మోర్చాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బాకారం జాగీర్‌లో ఉచిత వైద్య శిబిరం

- ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ లలితా దేవి

ప్రతిపక్షం, మొయినాబాద్, ఏప్రిల్ 1: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ లలితా దేవి అన్నారు. బుధవారం మొయినాబాద్ మండలం బాకారం జాగీర్ గ్రామపంచాయతీ పరిధిలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా (అంటువ్యాధి కాని వ్యాధులు) హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు.గ్రామంలోని ప్రజలకు బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నేటి కాలంలో గుండెపోటు మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో, అత్యవసర సమయంలో సీపీఆర్ ఎలా చేయాలో మరియు ప్రాణాలను ఎలా కాపాడాలో ప్రజలకు ప్రత్యక్షంగా వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ దినేష్, పంచాయతీ కార్యదర్శి శివ శంకర్, వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

- శంభీపూర్ క్రిష్ణ

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 1: నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నాని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణని నియోజకవర్గానికి చెందిన ప్రజలు, కాలనీ సభ్యులు, నాయకులు, అభిమానులు పలువురు కలిసి, పది సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అయన సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టి అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి వివేకానందల దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అదే విధంగా పలు కార్యక్రమాలలో పాల్గొనాలని పలువురూ ఆహ్వానించారు.



అయ్యప్పకు ప్రత్యేక పూజలు

ప్రతిపక్షం, చేవెళ్ల, ఏప్రిల్ 1: చేవెళ్ల అయ్యప్ప దేవాలయంలో ఘనంగా అయ్యప్ప స్వామి జన్మ తిరునక్షత్ర (ఉత్తరా నక్షత్రం) పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం ఉదయం పూజారి కిరణ్ కుమార్, ఎంఎం క్రిష్ణన్ ల ఆధ్వర్యంలో గణపతి, సుబ్రమణ్యం, మాలిక పురోత్తమ మంజు మాత, నాగరాజు స్వాములకు పంచామృత అభిషేకాలు చేపట్టారు. ఉత్సవ మూర్తి అయ్యప్పకు అభిషేకాన్ని నిర్వహించి దేవాలయంలో పల్లకి సేవను చేపట్టారు. అనంతరం పంబా ఆరాట్టు (ఫంగుణి ఆరాట్టు) కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా చేపట్టి అయ్యప్ప స్వామికి చక్ర స్నానం చేయించారు. అయ్యప్ప మాల ధరించిన పెద్దినోళ్ల నర్సింలు గౌడ్ పడిపూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల ధరించిన అయ్యప్ప గురుస్వాములు మల్లారి దయాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, దేవర రఘునాథ్ రెడ్డి, ఉదయ్ కిరణ్ రెడ్డి, కన్నె స్వామి దేవర సాయి గిరీష్ రెడ్డి అయ్యప్ప భక్తులు కనకమామిడి తిరుపతి రెడ్డి, ముచ్చ దామోదర్ యాదవ్, దామోదర్, కృష్ణ, బాలయ్య, వడ్ల శ్రీధర్ చారి పాల్గొన్నారు.



పదవీ విరమణ ఉద్యోగానికి తప్ప మనిషికి కాదు

- చిలుకూరు గురుకుల వేడుకల్లో బేగరి రాజు

ప్రతిపక్షం, మొయినాబాద్, ఏప్రిల్ 1: చిలుకూరు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల , కళాశాలలో పీజీటీ తెలుగు ఉపాధ్యాయులు దంతోజు సత్యం గారి పదవీ విరమణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. విద్యార్థుల ఆటపాటలు, కళానృత్యాలతో సభ ప్రాంగణం మారుమోగింది. గత 36 ఏళ్లుగా విద్యాశాఖలో దంతోజు సత్యం గారు అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ బేగరి రాజు మాట్లాడుతూ..."పదవీ విరమణ అనేది కేవలం ఉద్యోగానికి మాత్రమే, మనిషికి కాదు. వ్యక్తిలోని జ్ఞానానికి ఎప్పుడూ విరమణ ఉండదు" అని పేర్కొన్నారు. అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిదని, సమాజానికి దిశానిర్దేశం చేసేది గురువులేనని వారు స్పష్టం చేశారు."విద్యార్థి భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుంది" అన్న శ్రీశ్రీ మాటలను గుర్తు చేస్తూ, సత్యం గారు ఎంతో మంది పేద విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దారని ప్రిన్సిపాల్ శౌరి రాజు అభినందించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుల జీవిత పాఠాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు గొప్ప స్థాయికి ఎదగాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ వేడుకలో మాజీ ప్రిన్సిపల్ అశోక్ బాబు, ఉపాధ్యాయులు దేవేందర్ గౌడ్, లక్ష్మణరావు, మల్లయ్య, రవీందర్, పీడీ ఆదిబాబు, పీటీ గురువయ్య, మరియు పేరెంట్స్ కమిటీ సభ్యులు శ్రీకాంత్, శ్రీనివాస్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలి

ప్రతిపక్షం, మహేశ్వరం, ఏప్రిల్ 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర అడిషనల్ ఉపాధి కమిషనర్ గంగాధర్ కి మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టీయూసీ కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడా శివ వినతిపత్రం అందేశారు. అనంతరం శివ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ చేస్తున్న నాలుగు లేబర్ కోర్టు చట్టాలను వెంటనే రద్దు చేయాలని అలాగే ఉపాధి పథకం కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న, తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఐ ఎన్ టి సి నాగన్న గౌడ్,చంద్రశేఖర్,రామకృష్ణారెడ్డి, ఐలేష్ గౌడ్ ,మరియు ఐఎన్టియుసి సంబంధించిన నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతే. ఇక దాన్ని ఇంచు కూడా ఎవరూ కదిలించలేరు. అమరావతి బిల్లును లోక్‌సభలో ఇవాళ పెట్టారు. రేపు రాజ్యసభలో ఆమోదిస్తారు. గత పాలకులు అమరావతిని విధ్వంసం చేశారు. ఎడారి అని, శ్మశానమని ఎగతాళి చేశారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు.

- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

ప్రాంతీయం



ఇందిరమ్మ ఇళ్ల కమిటీ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు

- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు
- పూర్తి పారదర్శకతతో సర్వే
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 1 : నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేస్తున్న క్రమంలో.. ఎవరైనా ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల పేరుతో ఇల్లు, స్థలాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలో అత్యధిక శాతం పేద, మధ్యతరగతి ప్రజలు జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గ పరిధిలోని వేల మంది పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందజేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సొంత స్థలము ఉంటే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం, స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయిస్తోందని తెలిపారు. పూర్తి పారదర్శకతతో అర్హులైన ప్రతి ఒక్కరికి వీటిని అందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఇందిరమ్మ కమిటీ సభ్యుల పేరుతో కొందరు వ్యక్తులు పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, పట్టణాలు, డివిజన్లలో తిరుగుతూ ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామంటూ వేల రూపాయలు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా పీ.డీ చలపతిరావు ను ఆదేశించారు. ఈ అంశంపైన వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అక్రమార్కులకు అధికారులు సహకరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలో సర్వే జరుగుతుందని.. అతి త్వరలో అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డిఈ సుజాత, ఏఈ లు పాల్గొన్నారు.

పటాన్చెరులో పొలిటికల్ హీట్

- మైనింగ్ మంటల్లో కాక రేపుతున్న కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్
- ఒకరిపై ఒకరు ఆరోపణలు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 1: సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం లో పొలిటికల్ వేడి రాజుకుంది. పటాన్ చెరు నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ప్రెస్ మీట్ తో రాజకీయం కాక రేపుతోంది.కాట శ్రీనివాస్ గౌడ్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలకు కౌంటర్ గా మీడియా సమావేశం ఏర్పాటు చేసి బహిరంగ సవాల్ విసిరారు. "ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నీవు మనిషి పుట్టుక పుడితే నా సవాలు స్వీకరించు, రేపు 11 గంటలకి తడి బట్టలతో బీరంగూడ శివాలయం ఎక్కుదాం రా'' అన్నారు. ఒక్క గజం స్థలం కబ్జా చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా అన్నావు కదా, ఆధారాలతో సహా చూపెడుతున్న దమ్ముంటే రా సవాల్ స్వీకరించాలని సూచించారు. నీవు నిన్న మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలకు సవాలుగా ప్రతి అంశాన్ని ఆధారాలతో సహా బయట పెడతాను, తడిబట్టలతో గుడికి రా చూసుకుందాం రా అన్నారు. నిన్న ఎమ్మెల్యే మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు ఉత్త ఫేక్ మాటలని, హరీష్‌రావు స్క్రిప్ట్ ఇస్తే అది ఎమ్మెల్యే చదువుతాడు. హరీష్‌రావు పై మాట్లాడే స్థాయి కాదన్న మాటలకు కౌంటర్ ఇచ్చారు. నా కుటుంబం సుదీర్ఘ 50 సంవత్సరాల రాజకీయ కుటుంబం మాది, కాటా కుటుంబం పేరు మీద ఎన్నో కాలనీలు ఉన్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రవాణా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు మా ఇంటికి వచ్చి మా తండ్రి దర్శన్ గౌడ్ తో భోజనం చేసిన చరిత్ర మాదన్నారు. కాటా దర్శన్ గౌడ్ రాజకీయ బిక్ష పెట్టకపోతే నీకు రాజకీయం ఎక్కడిదన్నారు. ప్రభుత్వ స్థలాలను గీతలు గీసి అమ్మితే నీ స్థాయి కి వస్తాన, ఆధారాలు చూపెట్టకుండా నాటకాలు చేస్తూ నీచ రాజకీయాలు చేస్తున్నావని దుయ్యబట్టారు. మూడు సార్లు ఎమ్మెల్యే గా గెలిచాక కూడా అనుభవం లేకుండా, సోయి లేకుండా మాట్లాడుతున్నావని, స్క్రిప్ట్ ఇస్తే మాట్లాడడం కాదు అవగాహన తో మాట్లాడాలని హితవు పలికారు. పోచారం 62 సర్వే నంబర్ లో 5 ఎకరాల స్థలాన్ని కేటాయించిన వాస్తవమే, నువ్వు చేసిన 106 ప్లాట్లు ఎక్కడివి 62 సర్వే నెంబర్ కాకుండా 64, 65 వేసి రిజిస్ట్రేషన్ లు ఎందుకు చేశావని ప్రశ్నించారు. రామేశ్వరంబండ, ఇంద్రేశం శివార్లలోని 453 సర్వే నెంబర్ లోనీ యాక్సెస్ ల్యాండ్ 1.03 గుంటల భూమి గీతలు గీసి కాజేయడానికి ప్రయత్నాలు చేస్తున్నావని అన్నారు. 178 సర్వే నెంబర్ లో ప్లాట్లు చేసి అమ్ముతున్నది నిజం కాదా అని, 62 సర్వే నంబర్ 2019 లో అనుమతులు తీసుకొని 2020 రిజిస్ట్రేషన్ చేసుకున్న చరిత్ర నీదన్నారు. 62 సర్వే నంబర్ లో 106 ప్లాట్ల సంగతి వదిలే ప్రసక్తే లేదని, లక్ష గజాల డాక్యుమెంట్ ఉన్నది నీది కాద 2 లక్షల జీతంతో ఎన్ని ఆస్తులు సంపాదించవన్నారు. అమీన్ పూర్ చక్రపురి కాలనీలో 2000 గజాల రోడ్డు స్థలాన్ని నీ తమ్ముడు గూడెం మధు పేరు మీద రిజిస్ట్రేషన్ చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. కాటా మాట తప్పేటేడు కాదు, ఆదారాలు చూపించకుండా మాటలు చెప్తున్నావన్నారు. డబ్బులు వసూలు చేసిన అనే ఆరోపణలు నిరూపిస్తావా మాట మీద నిలబడాలి, రేపు 11 గంటలకు తడి బట్టలతో బీరంగూడ శివాలయం కు వస్తున్న నీకు దమ్ముంటే రేపు రావాలని సవాల్ విసిరారు. నీవు మనిషి పుట్టుక పుడితే నా సవాల్ ను స్వీకరించాలన్నారు. ఎమ్మెల్యే పదవి బరిలో ఉంటానని నన్ను సర్పంచ్ పదవిని అధికారులను బయపెట్టి పదవిని తీయించిన హరీష్ రావు, గూడెం మహిపాల్ రెడ్డి నా స్థాయి గురించి మాట్లాడుతున్నావా అన్నారు. సర్పంచ్ పదవి రాజకీయ వత్తిడితో తీసేపించారు అని గుడి ఎక్కుతున్న దమ్ముంటే రా, వెన్నుపోటు పొడిచి 3 సార్లు ఎమ్మెల్యే గా గెలిచావన్నారు. హరీష్ రావు రాజకీయాలలోకి రాకముందే పటాన్ చెరు లో కాటా కుటుంబం రాజకీయం ఏలుతుందన్నారు. పటాన్ చెరు మార్కెట్ యార్డ్ లో 348 లైసెన్సులు ఇచ్చావు, 140 లైసెన్సులు ఆక్టివ్ లో ఉన్నాయని, మార్కెట్ యార్డ్ లో 25 కోట్ల రూపాయల స్కాం చేశావు, వారిని కూడ వదలనని హెచ్చరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ 2009లో స్వర్గస్తులైతే 2010, 2011,2012 లో లక్దారంలో క్వారీకి అనుమతిలిచ్చారని తడబడుతూ మాట్లాడడం గూడెం మహిపాల్ రెడ్డి కి సిగ్గుచేటన్నారు.



సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

- పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణ, స్టేషన్ రికార్డుల పరిశీలన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 1: సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణ పరిశుభ్రతను పరిశీలించారు. వివిధ నేరాలలో సీజ్ చేసిన వాహనాలను క్రమబద్ధంగా ఉంచాలని సూచించారు. స్టేషన్ రికార్డులు జనరల్ డైరీ, హిస్టరీ షీట్లు, పిటిషన్ రిజిస్టర్‌లను తనిఖీ చేస్తూ అన్ని రికార్డులు తాజా సమాచారంతో అప్డేట్ గా ఉంచాలని అన్నారు. పెండింగ్ మరియు అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ఉండాలని ఎస్.హెచ్.ఓ కు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం "అరైవ్ అలైవ్" వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, రోడ్డు నిర్మాణంలో లోపాలను, అధిక ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలనౌ గుర్తించి, ఎన్ హెచ్ ఎ ఐ తో చర్చించి, మరమత్తులు చేయించాలని అన్నారు. తరచూ వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్, నాకాబంది వంటి ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించి అనుమానిత వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వ్యక్తిగత సమస్యలేమైనా ఉన్నట్లయితే సంబంధిత అధికారుల ద్వారా తన దృష్టికి తీసుకురావాలని, సిబ్బంది సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



హనుమాన్ శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 1: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా ప్రజలకు ముందస్తుగా హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే శోభాయాత్ర రోడ్డు మార్గాలను ఎస్పీ తనిఖీ చేశారు. శోభాయాత్రలు ప్రశాంతంగా జరగడానికి జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ వివరించారు. జిల్లా నలుమూలల, పలు ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి, నిరంతరం పెట్రోలింగ్ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హనుమాన్ జయంతి శోభాయాత్ర నిర్వాహకులకు తెలియజేయునది ఏమనగా ప్రజలు ఇబ్బందిపడే విధంగా పెద్ద శబ్దాలతో కూడిన డీజేలను ఏర్పాటు చేయకూడదని, ఇతర మతస్తుల మనోభావాలను దెబ్బతినే విధంగా వివాదాస్పద పాటలు, నినాదాలు, ప్రసంగాలు ఉండకూడదని, ర్యాలీలో పాల్గొనే ప్రతి ఒక్కరూ శాంతియుతంగా, సహనంగా ప్రవర్తించాలని అన్నారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే రూమర్లు, అనవసర పోస్ట్ లను నమ్మరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా రూమర్లను ప్రచారం చేస్తే అట్టి వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు. తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.





గీతంలో ప్రతిభావంతులైె విద్యార్థులకు ఏస్ అవార్డులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 1: శ్రేష్ఠతకు పట్టం కట్టి, ప్రతిభావంతులను ప్రోత్సహించే లక్ష్యంతో హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బుధవారం ఏస్ అవార్డులు 2026ను ప్రదానం చేసింది. ఉత్సాహభరితమైన, చైతన్యవంతమైన ప్రాంగణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ, శ్రేష్ఠత, ఆవిష్కరణ, విద్యార్థుల సంపూర్ణ విజయాలను వేడుకగా జరుపుకుంది. విద్య, సాంస్కృతిక, క్రీడా రంగాలలో రాణించిన విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించి, ఇతరులకు ప్రేరణగా నిలిచింది. ఆవిష్కరణ, సాంకేతికత, సృజనాత్మక శ్రేష్ఠత, సామాజిక ప్రభావం, నాయకత్వం వంటి విభాగాలలో అత్యుత్తమ విజయాలకు గుర్తింపుగా ఈ ఏస్ అవార్డులను ఇచ్చి ప్రోత్సహించారు. వీటితో పాటు ఉత్తమ అథ్లెట్ (యువతీ యువకులు), ఈ యేటి మేటి జట్టు (టీమ్ ఆఫ్ ది ఇయర్), వర్ధమాన క్రీడా ప్రతిభ, క్రీడా ప్రదర్శనలో శ్రేష్ఠత వంటి అవార్డుల ద్వారా క్రీడా రంగంలోని అత్యుత్తమ ప్రతిభావంతులను కూడా సత్కరించారు. అలాగే, విద్యార్థి క్లబ్బులు, ప్రత్యేక ఆసక్తి సమూహాలు (ఎస్ఐజీలు) వారి సృజనాత్మకత, సహకారం, ప్రాంగణ భాగస్వామ్యానికి చేసిన కృషికి గుర్తింపును ఇవ్వడం ద్వారా బలమైన సామాజిక భావాన్ని పెంపొందించారు. విద్య, సహపాఠ్య రంగాలలో శ్రేష్ఠతను ప్రోత్సహించడం ద్వారా, అన్ని రంగాలలో రాణించే, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న వ్యక్తులను తీర్చిదిద్దాలనే గీతం యొక్క నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రస్ఫుటీకరించింది. అవార్డు గ్రహీతల స్ఫూర్తిదాయకమైన కథలతో తోటివారిలో ప్రేరణ, ఆకాంక్షలను ఈ కార్యక్రమం పెంపొందించింది. గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు; రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగంక్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని, విజేతలకు అవార్డులను ప్రదానం చేసి, వారి వెన్నుతట్టి ప్రోత్సహించారు. స్టూడెంట్ లైఫ్ మేనేజర్ ఫిజా అహ్మద్, స్పోర్ట్స్ మేనేజర్ సూరజ్ వాడపల్లి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.



అర్హులైన సాగు రైతులకు భూ హక్కు పత్రాలు అందజేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ప్రతిపక్షం ప్రతినిది, జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 1: భూపాలపల్లి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను నమ్ముకుని సాగు చేసుకుంటున్న రైతులను గుర్తించి, వారికి తక్షణమే భూ హక్కు పత్రాలు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలాల వారీగా సాగులో ఉన్న ప్రభుత్వ భూములు, రైతుల సమస్యల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ధర్మారావుపేట గ్రామంలో సింగరేణి గనుల ఏర్పాటు వల్ల భూములు కోల్పోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని, గనుల ఏర్పాటు తర్వాత మిగిలిన భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని సూచించారు. సింగరేణి, జెన్కో పరిశ్రమల కోసం భూములు ఇచ్చిన రైతులకు రావాల్సిన పరిహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు. దాదాపు 70 ఏళ్లుగా భూమిని నమ్ముకున్న రైతులకు కోర్టు వివాదాలు లేని పక్షంలో, గ్రామ సభల ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి హక్కు పత్రాలు పంపిణీ చేయాలన్నారు. పట్టాలు లేకపోవడం వల్ల రైతులు ప్రభుత్వం అందించే రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. వివాదాలు లేని భూములను లైసెన్స్డ్ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి, త్వరితగతిన నివేదికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, ఆర్డీఓ హరికృష్ణ మరియు తహసీల్దార్లు పాల్గొన్నారు.

అభివృద్ధిలో కాజీపేట రూపురేఖలు మారుస్తాం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఏప్రిల్ 1: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట ప్రాంతాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలపాలని సంకల్పంతో ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గత పాలనలో కాజీపేట తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి కొత్త దిశగా సాగుతోందని 99 రోజుల ప్రణాళిక ప్రగతి పాలనలో భాగంగా 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ లో రోడ్డులో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నాయిని రాజేందర్ రెడ్డి నగర మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ గతంలో రాజకీయ ప్రయోజనాల కోసం శిలాఫలకాలు మాత్రమే ఏర్పాటు చేసి పనులు వదిలేసిన ఉదాహరణలు ఉన్నాయని విమర్శించారు. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితులకు ముగింపు పలికి, శంకుస్థాపన చేసిన పనులను వేగంగా పూర్తి చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయిస్తూ కాజీపేట రూపురేఖలను పూర్తిగా మార్చే దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు కాజీపేటలో వైద్య రంగంలో కూడా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టామని, ప్రజలు గత పాలనతో పోల్చి ప్రస్తుత ప్రభుత్వ పనితీరును అర్థం చేసుకోవాలని సూచించారు. కొంతమంది నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే కోచ్ ఫ్యాక్టరీ రైల్వే డివిజన్ బస్ స్టాండ్ వంటి అంశాలపై ఆందోళనలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారురాజకీయాలుపార్టీలకు అతీతంగా అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రజల మద్దతుతో కాజీపేటను ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నేతృత్వంలో సంక్షేమం అభివృద్ధి రంగాల్లో ప్రత్యేక దృష్టి సారించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు అలాగే నియోజకవర్గానికి 3500 ఇళ్లను కేటాయించగా ప్రస్తుతం ప్రతి డివిజన్‌లో ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



అమరావతికే కాకుండా రాష్ట్రంలో ఏ ప్రాంతానికీ మేము వ్యతిరేకం కాదు. అమరావతి పేరుపై అప్పులు తెచ్చి స్కామ్‌లు చేస్తున్నారు. లక్ష ఎకరాల్లో రోడ్లు, నీళ్లు, డ్రైనేజీకి రూ.2లక్షల కోట్లు కావాలి. అంత ఖర్చు చేసే స్థోమత మనకు ఉందా? ఏడేళ్లలో చంద్రబాబు ఖర్చు పెట్టింది రూ.8వేల కోట్లే. వీటికి అసెంబ్లీలో బాబు సమాధానం చెప్పాడా?.

- వైసీపీ చీఫ్ జగన్

రాష్ట్రీయం

పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం
- ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఏప్రిల్ 1: పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పరకాల టౌన్ పరకాల నడి కూడా మండలాలకుచెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 65 మంది లబ్ధిదారులకు 65 లక్షల 7540 వేల రూ విలువగల కళ్యాణ లక్ష్మి మరియు 87 మంది లబ్ధిదారులకు 34 లక్షల 21వేయి రూ విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసామన్నారు. పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిలుస్తుందని అన్నారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా 5660 మందికి 40కోట్ల 39 లక్షల 38వేల 452 రూ విలువగల చెక్కులను పంపిణీ చేశామన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు దనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నా మని తెలిపారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పరకాల ఇందిరా మహిళా డైరీ,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్,నూతన రేషన్ కార్డులుఇందిరమ్మ చీరల పంపిణీ200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రైతు బీమా సన్న వడ్లకు రూ 500 బోనస్,సన్న బియ్యం పంపిణీమహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ వడ్డీ లేని రుణాలు శ్రీనిధి రుణాలు ఇందిరమ్మ ఇల్లు,తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.



అయ్యప్ప ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి ఎదిగా

- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఏప్రిల్ 1: అయ్యప్ప స్వామి ఆశీర్వాదంతోనే తాను ఎమ్మెల్యేగా ఎదిగానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. అయ్యప్ప జన్మ దినోత్సవాన్ని పురస్కరించు కొని బుధవారం నగరంలోని అయ్యప్ప ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ ఇందూరు అయ్యప్ప ఎంతో మహిమాన్మితుడని, కొలిచిన వారికి అండగా నిలుస్తాడని తెలిపారు. జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని చేసిన అలంకరణ ఎంతో ఆకట్టుకుందన్నారు. మండల పూజ సమయంలో నగరంలోని అనేక పడి పూజలకు హాజరవుతానని, అది ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. అయ్యప్పను నమ్మినవారికి కొండంత అండగా నిలుస్తాడని పేర్కొన్నారు. యువత ఆధ్యాత్మికం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే గురువారం జరిగే హనుమాన్ శోభాయాత్ర కు భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. అనంతరం భజన బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి రమేష్ గురుస్వామి, గుండయ్య స్వామి, భక్తులు పాల్గొన్నారు.



గ్రామ సభలలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి

- గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ "వంటేరు"

ప్రతిపక్షం, గజ్వేల్, ఏప్రిల్ 1: ప్రజాప్రభుత్వం,ప్రజా పాలన అంటూ నిర్వహిస్తున్న గ్రామ సభల్లో కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ప్రజలు నిరదీయాలని గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం నాడు విలేకరులతో మాట్లాడుతూ అబద్దాల పునాదుల మీద రాజ్యమేలుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటూ ప్రజలను మోసం చేసిందన్నారు, జరగబోయే గ్రామ సభలలో ప్రజలు, బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన అమలు కానీ 420 హామీలపై,6 గ్యారెంటీలపై, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రభుత్వాన్ని గ్రామసభల లో నిలదీసి ఎండ కట్టాలని పిలుపునిచ్చారు.



జాతీయ ఉగాది పురస్కార గ్రహీతకు సన్మానం

- రామభక్తుల ఆధ్వర్యంలో రామకోటి రామరాజుకు సన్మానం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 1: నేటి ఆధునిక ప్రపంచంలో కూడా ఆధ్యాత్మికంగా భక్తులను ముందుకు తీసుకురావడం, ప్రతి వ్యక్తిచే రామకోటి వ్రాయించడం భద్రాచలం దేవస్థాన కల్యానానికి తెలంగాణ నుండి గోటి తలంబ్రాలు ప్రతి సంవత్సరం అందించే రామకోటి రామరాజుకు జాతీయ ఉగాది పురస్కారం వచ్చిందుకు సిద్దిపేట రామభక్తుల ఆధ్వర్యంలో మార్కండేయ దేవాలయంలో బుధవారం నాడు ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక రంగంలో గత 30యేండ్ల నుండి విశేష సేవలు అందించినందుకు రామకోటి రామరాజుకు జాతీయ స్థాయిలో ఉగాది పురస్కారం తెలుగు వెలుగు సంస్థ అదించడం గర్వకారణం అన్నారు. తీసుకురావడం, ప్రతి వ్యక్తిచే అద్భుత అవకాశం మన సంతోషించదగ్మరెన్నో ఆధ్యాత్మక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. గజ్వేల్ మున్స రామకోటి రామరాజు చేస్తున్న నిశ్వా కష్టాలు ఉన్న దేశ వ్యాప్తంగా లక్షల మంది భక్తులను తయారుచేసిన ఘనత రామకోటి రామాజుకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పెండోట శ్రీనివాస్, మామిడాల సురేష్, భైరన్ పల్లి శ్రీనివాస్, వేణు, మణికంత, రాకేష్, నరేష్, నాగరాజు, బోనాల శ్రీనివాస్, నాగేందర్ పాల్గొన్నారు.




మురికి కాల్వలో పడి వృద్ధుడి మృతి

ప్రతిపక్షం, నంగునూరు, ఏప్రిల్ 1: మురికి కాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన విషాద ఘటన సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నంగునూరుకు చెందిన దేవులపల్లి (పెర్మని) మల్లయ్య(75) బస్టాండ్ సమీపంలోని మురికి కాల్వలో పడి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడు. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగిందని భావిస్తున్నారు. బుధవారం ఉదయం పెర్మని మల్లయ్య మృత దేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రాజగోపాలపేట ఎస్సై వివేక్ నంగునూరు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

పారదర్శకంగా ఓటర్ జాబితా :కలెక్టర్



ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఏప్రిల్ 1:ఓటర్ జాబితా ప్రత్యేక సమీక్ష కార్యక్రమానికి సంబంధించిన ముఖ్య సూచనలపై జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ అధ్యక్షతన బుధవారం మినీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో SIR-2025 ప్రక్రియలో భాగంగా ఓటర్ల వర్గీకరణ, నమోదు, ధృవీకరణ చర్యలను సమగ్రంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం అత్యంత అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లను నాలుగు ప్రధాన వర్గాలుగా విభజించినట్లు వివరించారు: క్యాటగిరీ ఏ: 2025 సంవత్సరపు ఓటర్ జాబితాలో నమోదై, వయస్సు 39 సంవత్సరాల పైబడిన వారు మరియు 2002 ఓటర్ జాబితాలో కూడా నమోదు ఉన్న వ్యక్తులు. క్యాటగిరీ బి: 2025 సంవత్సరపు ఓటర్ జాబితాలో నమోదై, వయస్సు 39 సంవత్సరాల పైబడిన వారు అయితే 2002 ఓటర్ జాబితాలో నమోదు లేని వ్యక్తులు. క్యాటగిరీ సి: 2025 సంవత్సరపు ఓటర్ జాబితాలో నమోదై, 21 నుండి 38 సంవత్సరాల మధ్య వయస్సు గల ఓటర్లు.క్యాటగిరీ డి: 2025 సంవత్సరపు ఓటర్ జాబితాలో నమోదై, 18 నుండి 20 సంవత్సరాల మధ్య వయస్సు గల యువ ఓటర్లు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి వర్గానికి చెందిన ఓటర్ల వివరాలను ఖచ్చితంగా సేకరించి, ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్ జాబితాను నవీకరించాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. డూప్లికేట్ నమోదు, మరణించిన వారి పేర్లు, చిరునామా మార్పులు వంటి అంశాలను గుర్తించి సరిచేయాలని సూచించారు. అంతేకాకుండా, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బూత్ స్థాయి ఏజెంట్లు ను తప్పనిసరిగా నియమించాలని, వారితో సమన్వయం చేసుకుంటూ ఓటర్ జాబితా పరిశీలన, సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద బీఎల్ఏలు చురుకుగా పనిచేయడం ద్వారా తప్పులు తగ్గి, ఖచ్చితమైన ఓటర్ జాబితా సిద్ధమవుతుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయత పెంపొందించడంలో రాజకీయ పార్టీల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. పింగ్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించబడాలని, ప్రతి దశలో స్పష్టత ఉండేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో ఎన్వీ గిరి, ఎన్నికల విభాగ అధికారులు, సంబంధిత సిబ్బంది వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



40 కుటుంబాలకు నిత్యవసర సరుకుల పంపిణీ

- సామాజిక సేవలో ముందంజలో గ్రోస్ సంస్థ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఏప్రిల్ 1: మెదక్ పట్టణంలోని గ్రోస్ స్వచ్ఛంద సంస్థ సామాజిక బాధ్యతను చాటుతూ బుధవారం 40 పేద, అవసరమైన కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేసింది.ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులకు బియ్యం, పప్పులు, నిత్యవసర ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, అవసరమైన వారికి చేయూతనందించడం ఎంతో గొప్ప సేవ అని కొనియాడారు.ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా, ఆపదలో ఉన్నవారికి ఆశాకిరణంగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి జాయ్ ముర్రే మాట్లాడుతూ.. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డ్ కౌన్సిలర్ గంట సంపత్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తా

- గజ్వేల్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు కిరణ్ సాగర్

ప్రతిపక్షం, గజ్వేల్, ఏప్రిల్ 1: గజ్వేల్ మున్సిఫ్ కోర్టు ప్రాంగణంలో ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గా గెలుపొందిన కిరణ్ సాగర్, తోపాటు నూతన పాలకవర్గం సభ్యులు సీనియర్ న్యాయవాదుల సమక్షంలో బుధవారం నాడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కిరణ్ సాగర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న న్యాయవాద మిత్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ, గజ్వేల్ బార్ అసోసియేషన్ గౌరవాన్ని మరింత పెంచడానికి, బార్ అసోసియేషన్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, న్యాయవాదుల సమిష్టి కృషితో, న్యాయవాదుల సంక్షేమానికి ఎల్లవేళలా ముందుంటామని, కోర్టులో త్వరితగతిన న్యాయం చేకూరే విధంగా అందరితో సమన్వయంతో పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్, ఉపాధ్యక్షులు నరేష్ చారి, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, సహాయ కార్యదర్శి ఉమారాణి, కోశాధికారి అశోక్, క్రీడలు మరియు లైబ్రరీ అబ్దుల్ గఫార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామకృష్ణ, పరమేశ్వర్, అనూష, అంజలి, న్యాయవాదులు పాల్గొన్నారు.



హనుమాన్ నామ స్మరణతో మారుమ్రోగిన మెదక్

- ఘనంగా వీరాంజనేయ జన్మోత్సవ ర్యాలీ

ప్రతిపక్షం,మెదక్ టౌన్, ఏప్రిల్ 1: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మెదక్ పట్టణం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. బుధవారం సాయంత్రం భజరంగ్ దళ్, విహెచ్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరాంజనేయ జన్మోత్సవ ర్యాలీకి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. పట్టణంలోని ద్వారక కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర పాత బస్టాండ్, రాందాస్ చౌరస్తా మీదుగా కొదండ రామాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా "జై శ్రీరాం...జైజై శ్రీరాం...అంజనికుమార శ్రీ ఆంజనేయ" నినాదాలతో పట్టణం మారుమ్రోగింది.ర్యాలీలో మహిళలు భక్తి గీతాలు ఆలపించగా, యువకులు కేరింతలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. హనుమాన్, శ్రీరాముడి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. పట్టణ సీఐ మహేశ్ ఆధ్వర్యంలో పోలీసుల భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విహెచ్పీ, భజరంగదళ్, ఆరెస్సెస్ నాయకులతో పాటు హనుమాన్ మాలధారులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆత్మస్థైర్యంకై విద్యార్థినులకు కరాటే నైపుణ్యం అవసరం

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం, గజ్వేల్ (జగదేవ్ పూర్), ఏప్రిల్ 1: బాలికలకు, ఆత్మరక్షణ మరియు ఆత్మస్థైర్యం పెంపొందించడానికి కరాటే శిక్షణ అత్యంత అవశ్యం అని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. బుధవారం జగదేవ్ పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ హైమావతి సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోజు డైట్ మెనూ పాటిస్తూ నాణ్యమైన ఆహార పదార్థాలను రుచికరంగా వండాలని, వంటగది పరిసరాలు ఎల్లప్పుడూ పరి శుభ్రంగా ఉంచుకోవాలని వంట సిబ్బందిని ఆదేశించారు. అంతేకాకుండా విద్యార్థులు కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలని ముఖ్యంగా బాలికలకు, ఆత్మరక్షణ మరియు ఆత్మస్థైర్యం పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం బడులలో విద్యార్థినులకు ఉచిత కరాటే శిక్షణ ఇస్తుందని దీంతో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఏకాగ్రత మరియు ఆపద సమయంలో తమను తాము రక్షించుకునే నైపుణ్యాలను నేర్పుతుందనీ తెలిపారు. అనంతరం మండలంలోని తిగుల్ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని వైద్య అధికారికి సూచించారు. ఆసుపత్రిలో మేజర్, మైనర్ రిపేర్ పనుల గురించి ఆరా తియ్యగా మీకు మంజూరురైన ప్రతిదీ తప్పనిసరిగా కాంట్రాక్టర్ తో చేయించుకోవాలని ఆదేశించారు.



ఇరాన్ కొత్త పాలకులు కాల్పుల విరమణ కోసం అభ్యర్థించారు. హర్మూజ్ జలసంధిని తెరిస్తే కాల్పుల విరమణను పరిశీలిస్తాం. లేకుంటే ఇరాన్‌పై భీకర దాడులు చేసి రాతి యుగానికి పంపిస్తాం. అప్పటివరకు ఇరాన్‌పై దాడులు చేస్తూనే ఉంటాం. పాత పాలకుడితో పోలిస్తే ఇరాన్ కొత్త పాలకుడు తెలివైన వారు.

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

ప్రాంతీయం



అమ్మవారి దయతో అంతా మంచే జరగాలి

- ఎల్లమ్మ కళ్యాణం పత్రిక ఆవిష్కరణ
- మూడు రోజులపాటు ఉత్సవాలు
- తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్

ప్రతిపక్షం సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 1: అమ్మవారి దయతో అంతా మంచే జరగాలని సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి లో మూడు రోజులపాటు ఎల్లమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నామని తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు. బుధవారం మిట్టపల్లి లోని ఎల్లమ్మ దేవాలయంలో ఎల్లమ్మ కళ్యాణం ఉత్సవం సిద్ధోగం కు సంబంధించి కళ్యాణ పత్రికను గౌడ కుల పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అమ్మ వారి కళ్యాణ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ప్రస్తుతం ఈ నెలలో మూడు రోజులపాటు కళ్యాణోత్సవాలను నిర్వహించనున్నామని తెలిపారు. అమ్మవారి దయతో ఇప్పటివరకు అందరికీ మంచే జరిగిందని భవిష్యత్తులో మరింత మంచి జరిగి అందరూ బాగుండాలని అన్నారు. ఆలయానికి చుట్టూ ప్రహరీ కూడా తన సొంత ఖర్చులతో నిర్మించడానికి కృషి చేస్తానని గౌడ కుల సంఘ పెద్దలు కలిసికట్టుగా పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గౌడ కుల పెద్దలు సత్తయ్య, యాదగిరి గౌడ్, లింగం గౌడ్, సత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాడు ఇక్కడి నుంచి వలసలు.. నేడు ఇక్కడికే వలసలు

- మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు



ప్రతిపక్షం ప్రతినిధి,సిద్ధిపేట, ఏప్రిల్ 1: ఒకప్పుడు సిద్దిపేట ప్రాంతం నుంచి ఉపాధి కోసం వలసలు వెళ్లే వారిని, కాళేశ్వరం ప్రాజెక్టుతో నేడు ఇక్కడికే ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వలస వస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తన్నీరు హరీశ్ రావు అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం 300 మందికి రూ.62.88లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ నాడైనా... నేడైనా.. ఎప్పుడైనా అన్నింటా సిద్దిపేట అగ్రగామిగా నిలుస్తోందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల సిద్దిపేట పల్లెలకు కార్మికులు వలస వచ్చారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల మండుటెండల్లో సిద్దిపేట కాలువల్లో గోదావరి జలాలు పారుతున్నాయని అన్నారు. కాళేశ్వరం సిద్దిపేట నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 85,000 ఎకరాల్లో వరి సాగయిందన్నారు. ఒకప్పుడు బొంబాయి, దుబాయ్ కి వలస పోయిన సిద్దిపేట ప్రాంతం ప్రస్తుతం బీహార్, ఛత్తీస్‌గఢ్ కూలీలకు ఉపాధి చూపుతోందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని ఏ పల్లెలో చూసినా కాలువల్లో గోదావరి నీళ్లు గలగలా పారుతున్నాయన్నారు. మండుటెండల్లో చెరువులు మత్తడి దుంకుతున్నాయన్నారు. పచ్చని పొలాలు కనబడుతున్నాయని చెప్పారు. దీన్ని చూస్తుంటే చాలా సంతోషం కలుగుతోందన్నారు. ఒకప్పుడు ఊర్లలో మంచి నీళ్లకే ఇబ్బంది పడ్డామన్నారు. బిందెలు మోసి ఆడబిడ్డల భుజాలకు కాయలు కాసేవని వాపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టు సిద్దిపేట నియోజకవర్గానికి ఒక వరమని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకపోతే సిద్దిపేట ఎలా ఉండేదో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. ఒకప్పుడు బతుకు దెరువు కోసం బొంబాయి, దుబాయ్ కి ఇక్కడి ప్రజలు వలస వెళ్లేవారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో బీహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూలీలు నాట్లు వేయడానికి ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. ఎకరానికి రూ.4 వేల నుంచి రూ.5 వేలకు వరి నాట్లు వేసి పోతున్నారని గుర్తు చేశారు. బొంబాయి పోయిన ఇక్కడి ప్రజలు వేరే వాళ్లకు ఉపాధి ఇచ్చే స్థాయికి ఎదిగారని సంతోషం వ్యక్తం చేశారు. సాగునీరు పుష్కలంగా ఉండటంతో నంగునూరు, చిన్నకోడూరు రైతులు మిర్చి సాగు చేసి సంపాదిస్తున్నారని చెప్పారు. ఆయిల్ పామ్ తోటలతో లాభాలు పొంది, బాగు పడుతుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయంతో పాటు ఇక్కడి పిల్లల ఉపాధి కోసం మిట్టపల్లి ఇండస్ట్రియల్ కారిడార్ లో పరిశ్రమలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సిద్దిపేట ఐటీ పార్క్ ద్వారా ఇప్పటికే 600 మంది చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు లభించాయని పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు ఉపాధి రంగం, మరోవైపు ఐటీ రంగం.. ఇలా అన్ని రంగాల్లో సిద్దిపేటను ముందు వరుసలో నిలిపామని చెప్పారు. వ్యవసాయంతో పాటు ఐటీ, పారిశ్రామిక రంగాల్లో సిద్దిపేట అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రాబోయే రోజుల్లో కూడా అంతా కలిసికట్టుగా పనిచేసి సిద్దిపేటను అగ్రగామిగా నిలుపుకుందామని పిలుపు ఇచ్చారు. ఆపదలో ఉన్న సిద్దిపేట ప్రాంత ప్రజలకు తన వంతు సహాయంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సిద్దిపేట నియోజకవర్గం సాయం పొందిందని తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు 12,857 మందికి రూ.41.13 కోట్ల ఆర్థిక సాయం అందజేసినట్లు పేర్కొన్నారు. సీ ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వెంటనే లబ్ధిదారులు బ్యాంకులో ఖాతాలో వేసుకోవాలని కోరారు. తేదీ మారితే ఇబ్బంది అవుతుందన్నారు.



మార్జిన్లను తగ్గించి మా పొట్ట కొడుతున్నారు

- చికెన్ సెంటర్ అసోసియేషన్ ఆవేదన

ప్రతిపక్షం, గజ్వేల్, ఏప్రిల్ 1: పౌల్ట్రీ కంపెనీల దౌర్జన్య పూరిత ధోరణిని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ ఇచ్చిన రాష్ట్రవ్యాప్త బంద్ పిలుపులో భాగంగా, బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చికెన్ సెంటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చికెన్ సెంటర్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గత కొంతకాలంగా పౌల్ట్రీ కంపెనీలు వ్యాపారులకు ఇచ్చే మార్జిన్లను భారీగా తగ్గించి, పొట్ట కొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వహణ ఖర్చులు పెరిగి, లాభాలు లేక చికెన్ సెంటర్ల యజమానులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపారం చేయడం సాధ్యం కావడం లేదని వారు స్పష్టం చేశారు. పౌల్ట్రీ యాజమాన్యాలు వ్యాపారుల శ్రమను దోచుకుంటూ, అన్యాయమైన నిబంధనలతో ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. తగ్గించిన మార్జిన్లను వెంటనే పునరుద్ధరించి, వ్యాపారులకు న్యాయం చేసే వరకు మా నిరసన కొనసాగుతుందన్నారు..పౌల్ట్రీ కంపెనీల అన్యాయానికి వ్యతిరేకంగా తాము చేస్తున్న ఈ పోరాటంలో ప్రజలు, వినియోగదారులు సహకరించాలని అసోసియేషన్ కోరింది. సామాన్యుడికి తక్కువ ధరకు చికెన్ అందాలన్నా, చిన్న వ్యాపారులు బతకాలన్నా ఈ పోరాటం తప్పనిసరని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చికెన్ సెంటర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులు ఇమామ్, హుస్సేన్, తిరుపతి, కార్యదర్శులు రాజు, ముస్తఫా, మాజీ అధ్యక్షులు శేఖర్, జహీర్, సభ్యులు బాలకృష్ణ, గౌస్, నాగరాజు, రఫీ, షాదుల్లా, సత్తయ్య, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.



ఇసుక డంపు స్వాధీనం

- బహిరంగ వేలం ప్రకటన

ప్రతిపక్షం, చేగుంట, ఏప్రిల్ 1: అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంపులను నార్సింగి మండల రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నార్సింగి మండలం శేరిపల్లి గ్రామ శివారులోని ఎస్సీ కాలనీ సమీపంలో నిల్వచేసిన 18 ట్రాక్టర్ల ఇసుక స్వాధీనం చేసుకున్నారు. గురు వారం మధ్యాహ్నం తాసిల్దార్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం వేస్తున్నట్లు తహసిల్దార్ గ్రేసీ బాయ్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వ్యక్తులు అదే రోజు మధ్యాహ్నం 12 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.



బీజేపీ పాలనలో మహిళలకు భద్రత లేదు

- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 1: బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువైందని జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి మండిపడ్డారు. సిద్దిపేట నియోజకవర్గంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి ఆధ్వర్యంలో మహిళల భద్రతపై సమావేశం నిర్వహించారు. ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ సూచనలు, రాష్ట్ర అధ్యక్షురాలి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మహిళలు, బాలికలపై పెరుగుతున్న నేరాలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆమె ఆరోపించారు. "బేటీ బచావో, బేటీ పడావో" అంటూ నరేంద్ర మోడీ పలుమార్లు నినదించినప్పటికీ, ఆచరణలో మహిళలకు భద్రత కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన నేతలపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, వారిని కాపాడుతున్నారని ఆరోపించారు. బీజేపీ నేతలు మహిళలను గౌరవించడం లేదని, రాజకీయ వ్యవస్థలో మహిళలకు తగిన స్థానం ఇవ్వడం లేదని ముద్దం లక్ష్మి అన్నారు. మహిళలపై జరిగే అన్యాయాలను ఖండిస్తూ, ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గొట్టే కవిత, ప్రధాన కార్యదర్శి తోడెంగల రజిని, కార్యదర్శి శోభా, వార్డు సభ్యులు రాణి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రజిని, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.



ఏప్రిల్ 6న గద్దర్ ఫౌండేషన్ సభను జయప్రదం చేయండి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఏప్రిల్1: గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న హైదరాబాద్ లో జరిగే ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాలపై రాష్ట్ర స్థాయి సభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు జెల్లా సుధాకర్, పి శంకర్, హైమద్ లు పిలుపునిచ్చారు. గద్దర్ ఫౌండేషన్ పోస్టర్ ను బుధవారం నాడు మెదక్ గుల్షన్ క్లబ్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా యుద్ధ నౌక గద్దర్ పై కాల్పులు జరిగిన రోజున గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సభను నిర్వహిస్తారని తెలిపారు. ఈ దినాన్ని గద్దర్ పునర్జన్మ దినంగా సైతం పాటిస్తారని తెలిపారు. ఏప్రిల్ 6న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం ఐదు గంటల నుండి జరిగే ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాల సభకు ప్రతి ఒక్కరు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, సీనియర్ జర్నలిస్ట్ నాగరాజు, నీరుడిఇసాక్, కంబాల పోచయ్య, బత్తుల ప్రసాద్ వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెత్త సేకరణ కార్మికుల బకాయిలు చెల్లించాలి

- మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా

ప్రతిపక్షం, గజ్వేల్, ఏప్రిల్ 1: మున్సిపల్ ఆధ్వర్యంలో చెత్తసేకరించే ఆటో కార్మికులకు బకాయి పడిన ఆరు నెలల వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ ఆఫీసు ముందు బుధవారం నాడు కార్మికులు నిరసన తెలుపుతూ బైఠాయించారు. అంతేకాకుండా స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతూ కార్మికుల జీతాలను నెలల చెల్లించాలంటూ ధర్నా నిర్వహించారు. దీంతో మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్, కమిషనర్ వెంకట గోపాల్ కార్మికులతో చర్చలు జరిపి త్వరలో బకాయిలను అందించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఇదే కార్యక్రమంలో కార్మికులకు మద్దతుగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నాలు పాల్గొనడం విశేషం.



'సెట్విన్' సంస్థను సద్వినియోగం చేసుకుందాం

- మున్సిపల్ చైర్ పర్సన్ చందన రవీందర్

ప్రతిపక్షం, గజ్వేల్,ఏప్రిల్ 1: ప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన 'సెట్విన్' ద్వారా తక్కువ ఖర్చుతో అందిస్తున్న స్వయం ఉపాధి నైపుణ్య శిక్షణ కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ చందన రవీందర్ సూచించారు. గజ్వేల్ పట్టణంలో సెట్విన్ సంస్థ ప్రారంభమై 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం నాడు స్థానిక మున్సిపల్ కార్యాలయంలోజరిగిన కార్యక్రమంలో పాల్గొన్న చందన యువతకు అందిస్తున్న వివిధ కోర్సుల నైపుణ్య శిక్షణ కరపత్రాలను మున్సిపల్ కమీషనర్ వెంకట గోపాల్, పాలకవర్గంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ యువజన సేవల శాఖలో భాగమైన సెట్విన్ సంస్థ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల ప్రత్యేక చొరవతో గజ్వేల్ లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గజ్వేల్ ప్రాంత యువతి యువకులు అన్ని రంగాల్లో ముందుండాలన్న ఆలోచనతో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. తమ శిక్షణ సంస్థ ద్వారా ఎంఎస్ ఆఫీస్, డిటిపి, పిపిటిటిసి(ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్స్), మగ్గం, గార్మెంట్ మేకింగ్, మెహందీ డిజైనింగ్, బ్యూటీషియన్, రిఫ్రిజిరేటర్ & ఏ/సి రిపేర్, ఎలక్ట్రీషియన్, సిసి కెమెరా ఏర్పాటు కోర్సులను అతి తక్కువ ఫీజులతో శిక్షణ ఇవ్వడంతో పాటు టెక్నికల్ బోర్డు ఆమోదిత సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందని ఇన్స్ట్రక్టర్ ఖదీర్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఏప్రిల్ 1: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలను యదా విధిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మెదక్ జిల్లా కేంద్రం లో సిఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు డిమాండ్ల ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా కోశాధికారి కే నర్సమ్మ మాట్లాడుతూ కార్మిక వర్గం గత 100 సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానం లో 4 లేబర్ కోడులను అమల్లోకి తెచ్చిందన్నారు.ఈ లేబర్ కోడులు కార్మిక హక్కులకు పెద్ద ప్రమాదం అని ఆవేదన వ్యక్తం చేశారు.కొత్తగా తెచ్చిన లేబర్ కోడులు బడా కార్పొరేట్ సంస్థలకు ,యజమానులకు అనుకూలంగా ఉన్నాయనీ అన్నారు.అంబానీ,అదానీ లకు లాభాల సౌకర్యం కోసం పేదలకు ,రైతులకు నష్టం కలిగించే విద్యుత్ ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. విద్యుత్ బిల్లు అమలు ఐతే పేదలకు ఉచిత విద్యుత్,రైతులకు వ్యవసాయ భూముల కు విద్యుత్ ఉచితంగా ఉండదని ఆమె అన్నారు. విద్యుత్ ను ప్రైవేటీకరణ చేయడం కాకుండా ప్రభుత్వమే విద్యుత్ సంస్థలు నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ఏసు, అమృత్ ,సురేష్, శ్రీకాంత్,ఉషమ్మ,ఎల్లమ్మ,కార్మికులు పాల్గొన్నారు.

యాసంగి వరి కొనుగోళ్లకు సమగ్ర ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి



ప్రతిపక్షం సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 1: జిల్లాలో రబీ (యాసంగి) 202526 సీజన్‌లో ప్యాడీ కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు కొనుగోలు కేంద్రాల్లో ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు.బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో వరిధాన్యం సేకరణ, మద్దతు ధర అమలు అంశాలపై డీఆర్డీఓ, సహకార శాఖ, మెప్మా తదితర శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈసారి జిల్లాలో ధాన్యం దిగుబడి గణనీయంగా పెరిగిన నేపథ్యంలో, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కేంద్రాల్లో రైతులకు అవసరమైన మంచినీటి సదుపాయం, టెంట్లు, బ్యానర్లు, ప్యాడీ క్లీనర్లు, రిజిస్టర్లు, టార్పాలిన్లు ఏర్పాటు చేయడంతో పాటు, కేంద్రం బార్డర్ వరకు స్పష్టంగా కనిపించేలా లైటింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు.అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి నష్టపోకుండా ఎత్తైన ప్రదేశాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా చూడాలని, రైతులు పండించిన పంటను కల్లాల్లో బాగా ఆరబెట్టిన తర్వాత మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అధికారులు, రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా రైతులకు తెలియజేయాలని సూచించారు. ధాన్యాన్ని బాగా తూర్పారబెట్టిన తరువాత మాత్రమే కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించేలా చూడాలని, రైతులతో పూర్తి బాధ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కన్సెంట్ తీసుకోవాలని తెలిపారు.ఈ నెలలో ధాన్యం దిగుబడి అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి కొనుగోలు కేంద్రంలో మాయిశ్చర్ మీటర్లు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రతిరోజూ ఉదయం ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి మధ్యాహ్నం కల్లా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లుల సామర్థ్యాన్ని బట్టి కేటాయించిన ధాన్యం దిగుమతి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, స్టోరేజ్ సామర్థ్యాన్ని ముందుగానే సమీక్షించుకోవాలని, అవసరమైతే అదనపు నిల్వ స్థలాన్ని సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎక్కడైనా లోపాలు తలెత్తితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాలను ధృవీకరించడంలో నిర్లక్ష్యం వహిస్తే వ్యవసాయ శాఖ అధికారులపై కూడా తీవ్ర చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, సివిల్ సప్లై అధికారి తనూజ, డియం సివిల్ సప్లై అధికారి గోపీకృష్ణ, ఎల్డియం హరిబాబు, మార్కెటింగ్ అధికారి నాగరాజు, అడిషనల్ డిఆర్డిఏ సుధీర్ బాబు, మెప్మా పిడి హన్మంత్ రెడ్డి మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



కేరళలో ఏ కుటుంబం కూడా వైద్యపరమైన సంక్షోభం వల్ల ఇబ్బంది పడకూడదు. అయితే, కాంగ్రెస్ ప్రవేశపెట్టిన రూ. 25 లక్షల కవరేజీ వల్ల ఏ కుటుంబానికి ఆర్థిక భారాన్ని మోయాల్సిన పరిస్థితి ఏర్పడదు. ఆరోగ్య సంరక్షణ అనేది ప్రతి ఒక్కరి హక్కు. ప్రతి కేరళీయుడికీ ఆ హక్కును సాకారం చేసేందుకు యూడీఎఫ్ కట్టుబడి ఉంది.
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



అసోం మహిళలతో కలిసి తేయాకు తెంపిన ప్రధాని మోదీ

అసోంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ అక్కడ పర్యటిస్తున్నారు. ఇవాళ రెండు కార్యక్రమాల్లో ఆయన పాల్గోనున్నారు. అయితే డిబ్రూఘర్‌లో ఇవాళ ఉదయం ఓ టీ గార్డెన్‌కు ప్రధాని మోదీ వెళ్లారు. స్థానిక మహిళా కార్మికులతో కలిసి ఆయన తేయాకును తెంపారు. టీ గార్డెన్ వర్కర్లు ప్రధాని మోదీతో కలిసి సెల్ఫీ కూడా దిగారు. అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రధాని ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. దీమాజి జిల్లాలోని గోగాముక్, బిశ్వనాథ్ జిల్లాలోనూ జరిగే మీటింగ్‌ల్లో ఆయన పాల్గొంటారు. మంగళవారమే బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టో రిలీజ్ చేసింది. రెండు లక్షల ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఆ మ్యానిఫెస్టోలో పేర్కొన్నది. 5 లక్షల కోట్ల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాన్ కూడా వేసిది. స్థానిక తెగల భూ హక్కులను కాపాడనున్నట్లు చెప్పింది. మళ్లీ అధికారంలోకి వస్తే యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేయనున్నట్లు పేర్కొన్నది. ఒకవేళ మళ్లీ ఎన్నికైతే 1950 నాటి ఇమ్మిగ్రాంట్స్ ఎక్స్‌పల్షన్ యాక్ట్‌ను అమలు చేయనున్నట్లు సీఎం బిశ్వశర్మ తెలిపారు. ఆ చట్టం ప్రకారం జిల్లా అధికారులు వలస కార్మికులను తరిమే అధికారం ఉంటుంది.



విశ్వ వీక్షణం



పౌరసత్వం తనిఖీ ఈసీ పని కాదు

- సర్ ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఒవైసీ
- సర్ ప్రక్రియకు వ్యతిరేకం అంటూ వెల్లడి

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ(సర్)పై ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అభ్యంతరం వ్యక్తం చేశారు. పౌరసత్వాన్ని తనిఖీ చేయడం ఎన్నికల సంఘం పరిధిలో లేదని, అది హోం మంత్రిత్వ శాఖ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు ఒవైసీ తెలిపారు. బంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా విలేకర్లతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'సర్ ప్రక్రియకు మేం వ్యతిరేకం. సుప్రీంకోర్టులో మా రిట్ పిటిషన్ ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. పౌరసత్వాన్ని తనిఖీ చేసే అధికారం ఎన్నికల సంఘానికి లేదు. ఇది హోం మంత్రిత్వ శాఖ బాధ్యత. మేం చెప్పేది ఇంతే. బంగాల్‌లో ఓటర్ల జాబితా తుది ప్రకటన ఆలస్యమవుతోంది. వివాదాస్పద జాబితాలో ఉన్న పేర్లను వెంటనే ఖరారు చేయాలి. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ మొదలైంది. ఇలాంటి ఆలస్యం తగదు. దీనిని సరిదిద్దాల్సిన అవసరం ఉంది' అని ఒవైసీ అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించేందుకు ఒవైసీ కోల్‌కతాకు చేరుకున్నారు. ముర్షిదాబాద్‌లో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ ర్యాలీ ద్వారా స్థానిక సమస్యలు, ఉద్యోగాలు, విద్య, మౌలిక సదుపాయాలుపై దృష్టి సారించడంతో పాటు, జాతీయ స్థాయి అంశాలతో వాటిని అనుసంధానించేందుకు పార్టీ ప్రయత్నిస్తోంది. అయితే ఈ ఎన్నికల ర్యాలీ కేవలం ఒక ప్రచార కార్యక్రమం మాత్రమే కాదని, బంగాల్‌లో తమ స్థానాన్ని పరీక్షించుకోవడానికి ఎంఐఎం చేస్తున్న ఒక ప్రయత్నంలో భాగంగా భావిస్తున్నారు.



ట్రైగ్లిజరైడ్స్‌తో జర జాగ్రత్త..



డా. కౌశల్ గోవర్ధన
ఏం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
ధనుంజయ నర్సింగ్ హోమ్, హైదరాబాద్
7702417779



చెడు కొవ్వుతో పాటు ట్రైగ్లిజరైడ్ కూడా హానికారక కొవ్వే. ఇది రక్తంలో ఎక్కువగా ఉంటే ప్రమాదకరమే. రక్తంలో అధికంగా ఇవి ఉండటంతో గుండెకు ఇబ్బందులు వస్తున్నాయి. గుండె జబ్బులున్న వారిలో కొలెస్ట్రాల్ సాధారణంగా ఉన్నా.. ట్రైగ్లిజరైడ్ అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇవి జీవక్రియల వేగాన్ని మందగించేలా చేస్తాయి. వీటితో రక్త నాళాల గోడలు దెబ్బతింటాయి. రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ ముద్దలుగా పేరుకొని పోతుంది. గుండె జబ్బులకు కారణమవుతుంది.

ట్రైగ్లిజరైడ్స్ Triglycerides: అంటే ..

రక్తంలో కనిపించే ఒక రకమైన కొవ్వు పదార్థం. ట్రైగ్లిజరైడ్‌లు మనం తినే ఆహారాలలో ఉండే కొవ్వుల ప్రధాన భాగాలలో ఒకటి, ఇది శరీరం కూడా ఉత్పత్తి చేస్తుంది. ట్రైగ్లిజరైడ్స్ శరీరానికి శక్తి అందించే ప్రధాన వనరు. ఇవి కొవ్వు కణాలలో స్టోర్ ఉంటాయి, శరీరానికి శక్తి అవసరమైనప్పుడు వీటిని ఉపయోగించుకుంటుంది. అయితే, రక్తంలో ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలు పెరిగితే ప్రాణానికి హాని పొంచి ఉంటుంది. మన భారత దేశంలో రక్తంలో అధిక కొలెస్ట్రాల్ కన్నా ట్రైగ్లిజరైడ్ల సమస్యే ఎక్కువగా ఉంది. గుండె, రక్తనాళాల సమస్యలతో బాధపడే.. 70% మందికి కొలెస్ట్రాల్ మామూలుగానే ఉంటున్నా ట్రైగ్లిజరైడ్లు ఎక్కువగా కనిపిస్తుంది.... కొలెస్ట్రాల్ చాలా జబ్బులకు కారణమవుతుంది. ఇందులో మంచి కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్ రెండూ ఉంటాయి. అయితే చెడు కొలెస్ట్రాల్ను తగ్గించుకోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయాలో తెలియక చాలా మంది ఇబ్బంది పడుతుంటారు. వీటితో పాటు ట్రైగ్లిజరైడ్ కొవ్వులను పెద్దగా పట్టించుకోం. ఇది చాలా ప్రమాదకరము ..ఆహార జాగ్రత్తలు తీసుకుంటూ మందులు వాడితే ఫలితం ఉంటుంది. రక్తంలో ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలు ఎక్కువైతే.. గుండె సమస్యల ముప్పు పెరుగుతుంది. ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలు పెరిగితే.. ఇన్సులిన్ అసమతుల్యతకు దారితీస్తుంది. వీటి స్థాయులు మించిపోతే ప్రతి జీవ రసాయన ప్రక్రియకూ అడ్డుతగులుతుంటాయి. జీవక్రియల వేగాన్ని మందగింపజేస్తాయి. ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలు ఎక్కువైతే.. రక్తనాళాల గోడలు దెబ్బతినటం. రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ ముద్దలుగా పేరుకుపోవటం. కొలెస్ట్రాల్ పేరుకుపోవటానికి ముందే అధికంగా ఉన్న ట్రైగ్లిజరైడ్లు అక్కడ పైపొరను దెబ్బతీస్తాయి. తర్వాత కొలెస్ట్రాల్ వచ్చి చేరుతుంది. ఇది స్ట్రోక్, గుండె పోటు వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక ట్రైగ్లిజరైడ్స్ వల్ల ప్యాంక్రియాటైటిస్ (వాపు)వచ్చే అవకాశం ఉంది.

ముఖ్య గమనిక..

సాధారణ స్థాయి: సాధారణంగా, ఉపవాసం ఉండి పరీక్షించినప్పుడు ట్రైగ్లిజరైడ్ స్థాయిలు, పెద్దలలో (150 mg/dL) కంటే తక్కువగా, పిల్లలలో (90 text{ mg) కంటే తక్కువగా ఉండాలి .ప్రమాదాలు: అధిక ట్రైగ్లిజరైడ్ స్థాయిలు గుండెపోటు, స్ట్రోక్ మరియు ప్యాంక్రియాటైటిస్ (ప్యాంక్రియాస్ వాపు) వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతాయి. కారణాలు: అధిక క్యాలరీల ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు, ధూమపానం, మద్యం సేవించడం, మరియు మధుమేహం (diabetes) వల్ల ఇవి పెరుగుతాయి. నియంత్రణ: ఆరోగ్యకరమైన ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామం ద్వారా వీటిని సాధారణ స్థితికి తీసుకురావచ్చు.

తీసుకోవల్సిన ఆహారం..

ముందుగా మన డైట్‌లోనే కొన్ని మార్పులు చేయడం వల్ల చాలా వరకూ ట్రైగ్లిజరైడ్స్‌ని తగ్గించుకోవచ్చు. దీనికోసం ప్రాసెస్డ్ ఆయిల్స్‌ని వాడొద్దు. వీటి బదులు కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్ వాడడం మంచిది. రోజువారీ ఆహారంలో గింజలు చేర్చుకోవడం వల్ల గుండె మాత్రమే కాదు మొత్తం ఆరోగ్యాన్ని కాపాడతాయి. ట్రైగ్లిజరైడ్స్ తగ్గించి ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తాయి. మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్లు, విటమిన్ ఇ, మినరల్స్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో ఉంటాయి. ఇవి గుండెకి మేలు చేసేందుకు దోహదపడతాయి..

రోజూ కొద్దిపాటి వర్కౌట్ చేయాలి. వారంలో ఎక్కువ రోజుల్లో కనీసం 30 నిమిషాలపైన ఫిజికల్ యాక్టివిటీ ఉండేలా చూసుకోండి. రెగ్యులర్ వర్కౌట్ చేయడం వల్ల ట్రైగ్లిజరైడ్స్ తగ్గుతాయి. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. ఎప్పుడు యాక్టివ్‌గా ఉంటారు. ఎక్సర్‌సైజ్ చేయడం వీలు కాకపోతే మెట్లు ఎక్కి దిగడం, ఖాళీ టైమ్‌లో నడవడం వంటివి చేయండి.

ఫుడ్‌లో షుగర్, ప్రాసెస్డ్ ఫుడ్స్‌ని కంట్రోల్ చేయండి. చక్కెర వంటి సాధారణ కార్బోహైడ్రేట్స్, తెల్లపిండి, ఫ్రక్టోజ్ తో తయారైన ఆహారాలు తీసుకోవడం వల్ల ట్రైగ్లిజరైడ్స్ పెరుగుతాయి. కాబట్టి, వీటిని తగ్గించండి. వీటి బదులు తాజా ఆకుకూరలు, పండ్లు, నట్స్, సీడ్స్ తీసుకోండి.



ఇది బీజేపీ లూట్ దివస్

- ప్రజలు ఊరట కోరుకుంటుంటే, లూటీ చేస్తున్నారు
- దేశాన్ని దోపిడీ చేయడంపైనే మోదీ సర్కారు ఫోకస్
- టీ, తినుబండారాల రేట్లు కూడా పెరిగిపోయాయి
- 900కుపైగా ఔషధాల ధరలు పెరగబోతున్నాయి : కాంగ్రెస్

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: దేశంలో నుంచి చాలా నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని, ఇది బీజేపీ లూట్ దివస్ అని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. భారత్ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు సర్వ నాశనం చేయబట్టే ఈ దుస్థితి దాపురించిందన్నారు. ఈ సంక్షోభ కాలంలో దేశంలోని సామాన్యులు ఊరట కోసం ఎదురు చూస్తుంటే, బీజేపీ సర్కారు మాత్రం ప్రజలను లూటీ చేయడంపై, దేశాన్ని దోపిడీ చేయడంపై పూర్తి ఫోకస్ పెట్టిందని ఆయన మండిపడ్డారు. ఈమేరకు బుధవారం రోజు ఖర్గే ఒక ట్వీట్ చేశారు. "దేశ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు నాశనం చేసిన పర్యవసానాన్ని ఇప్పుడు 140 కోట్ల మంది భారతీయులు భరిస్తున్నారు. ఈరోజు నుంచి పలు నిత్యావసరాలు, 900కుపైగా ఔషధాల ధరలు పెరగబోతున్నాయి. దీనివల్ల ప్రజల ఆరోగ్య సంరక్షణ వ్యయాలు చుక్కలను అంటుతున్నాయి. గుండె జబ్బులు ఉన్న రోగులకు అమర్చే కరోనరీ స్టంట్ల ధరలూ పెరిగాయి. వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరలు రాకెట్ వేగంతో పెరుగుతున్నాయి. ఈ సిలిండర్ల సప్లై దారుణంగా తగ్గిపోయింది. దీంతో టీ రేటు, రోడ్డుపక్కన అమ్మే తినుబండారాల రేట్లు కూడా పెరిగిపోయాయి. ప్రత్యేకించి ప్రభుత్వ స్కూళ్లలో అమలుచేసే మధ్యాహ్న భోజన పథకంపైనా ప్రతికూల ప్రభావం పడుతోంది. విమాన ఇంధనం ధర మరింత ప్రియం అవుతోంది. ఒకప్పుడు సామాన్య పౌరులూ విమానాల్లో ప్రయాణించేవారు. ఇప్పుడు విమాన ప్రయాణం అనేది ఖరీదైన విషయంగా మారిపోయింది. సాక్షాత్తూ ప్రభుత్వమే విమాన టికెట్ల ధరలపై పరిమితిని ఎత్తేసింది. బిట్యుమెన్ ధరలూ 50 శాతం పెరిగాయి. ప్రజలు ఇప్పుడు మరింత ఎక్కువ టోల్ ట్యాక్స్‌ను చెల్లించాల్సి వస్తోంది. ఇది హైవేలపై దారుణమైన దోపిడీలా మారిపోయింది. స్పీడ్ పోస్ట్ ఛార్జీ సైతం 34 శాతం పెరిగింది. ప్లాస్టిక్ వస్తువులు, స్టీల్, సిరామిక్స్, రైతులు వినియోగించే పీవీసీ పైపుల ధరలూ పెరిగాయి. దేశ నిర్మాణ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది" అని ట్వీట్ లో ఖర్గే ప్రస్తావించారు.





ఎక్సైజ్ పాలసీకేసు.. కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు చుక్కెదురైంది. ఈ కేసుకు సంబంధించి ఈడీ సమన్‌లు జారీచేసినా కేజ్రీవాల్ విచారణకు హాజరుకాకపోవడంతో.. ట్రయల్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హైకోర్టును ఆశ్రయించింది. ఈడీ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం కేజ్రీవాల్‌కు నోటీసులు జారీచేసింది. ఈడీ పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. న్యాయవాది జొహెబ్ హుస్సేన్ ఈడీ తరపున వాదనలు వినిపించారు. కేజ్రీవాల్‌కు ముందుగానే నోటీసులు ఇచ్చినా ఆయన తరపున ఎవరూ హాజరుకాలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేజ్రీవాల్‌ను నిర్దోషిగా ప్రకటించడం ద్వారా ట్రయల్ కోర్టు తీవ్రమైన తప్పిదం చేసిందని వాదించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద జారీ చేసిన సమన్లు ఆయనకు అందినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. కేజ్రీవాల్‌కు తాజాగా నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఏప్రిల్ 29కి వాయిదా వేసింది. అలాగే ట్రయల్ కోర్టు రికార్డులను సమర్పించాలని ఆదేశించింది. గతంలో పీఎంఎల్ఏ సెక్షన్ 50 కింద ఈడీ జారీ చేసిన ఐదు సమన్లను కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని ఆరోపిస్తూ ఈడీ రౌస్ అవెన్యూ కోర్టులో ఫిర్యాదు చేసింది. అయితే ఈ ఫిర్యాదులను విచారించిన అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పరాస్ దలాల్.. కేజ్రీవాల్‌పై విచారణ కొనసాగించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ ఆయనను నిర్దోషిగా ప్రకటించారు. ఈ తీర్పును ఇప్పుడు ఈడీ హైకోర్టులో సవాలు చేసింది. అదేవిధంగా ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన అవినీతి కేసులో కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా 23 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ కూడా హైకోర్టులో విచారణలో ఉంది.







'గాయపడ్డ సింహం' నుంచి వైరల్ 'బ్రైడ్ సాంగ్'

డిఫరెంట్ ఎంటర్టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం' తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని పవన్ సదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్ల పై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. ఈ చిత్రం ట్రైలర్, విభిన్నమైన ప్రమోషనల్ సాంగ్ ప్రాజెక్ట్‌పై అంచనాలను పెంచాయి. ఈ రోజు సెకండ్ సింగిల్ 'బ్రైడ్ సాంగ్'ను విడుదల చేశారు. ఈ లేటెస్ట్ సింగిల్‌ను ప్రీవెడ్డింగ్ సెలబ్రేషన్ మూడ్‌ను ఫ్రెష్‌గా, ఫన్‌తో నింపేలా రూపొందించారు. పెళ్లి ముందు ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్న వధువు భావాలను అందంగా ప్రజెంట్ చేస్తోంది. సాధారణంగా కనిపించే సింపుల్ ప్రెజెంటేషన్‌కు భిన్నంగా, ఈ పాటలో వధువును బోల్డ్‌గా, స్టైలిష్‌గా, ఫుల్ ఆఫ్ లైఫ్‌గా చూపించారు. సంగీత దర్శకుడు స్వీకర్ ట్రెండీ బీట్స్‌తో పాటు ఫెస్టివ్ ఫ్లేవర్‌ను అద్భుతంగా మేళవించారు. ఆయన పాడిన ఇంగ్లీష్ పార్ట్స్, శ్రీమణి రాసిన ఎనర్జిటిక్ తెలుగు లైన్స్ కలిసి ఈ పాటకు కూల్, కాంటెంపరరీ టచ్‌ను ఇచ్చాయి. ఈ లిరిక్స్‌లో నేటి వెడ్డింగ్ హంగామా, సెల్ఫీలు, రీల్స్, గ్లామ్ టచెస్, వైరల్ అవ్వాలనే ఎగ్జైట్‌మెంట్ స్పష్టంగా కనిపిస్తాయి. ఫారియా తన ఎనర్జిటిక్ మూవ్స్, ఎక్స్‌ప్రెసివ్ పెర్ఫార్మెన్స్‌తో స్క్రీన్‌పై మెరిసింది. బ్రైడల్ జాయ్‌ను ఎంతో సహజంగా క్యారీ చేస్తుంది. ఈ పాటకు మరింత వైబ్రెన్సీ తీసుకొచ్చింది మనీషా ఈరబత్తిని వాయిస్. ఆమె రిఫ్రెషింగ్ వోకల్స్ ఈ సాంగ్‌ను వెంటనే ప్లేలిస్ట్‌లో పెట్టేలా చేస్తాయి. చివర్లో తరుణ్ భాస్కర్ ఎంట్రీ ఇచ్చి, తనదైన ఫన్ వైబ్‌తో ఈ సెలబ్రేషన్‌ను మరింత డబుల్ చేశారు.

'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' క్రేజీ టీజర్ రిలీజ్

వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో అలరిస్తున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన క్రేజీ లవ్ స్టోరీ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ చిత్రాన్ని నయనతార నిర్మించగా, కృతి శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, యోగి బాబు కీలక పాత్రలు పోషించారు. హీరో రానా దగ్గుబాటి ఈ సినిమా తెలుగు టీజర్‌ను లాంచ్ చేశారు. "ప్రపంచం ఎక్కడికో వెళ్లిపోయింది... మనం ఇప్పుడు 2040లో ఉన్నాం. కానీ ఒకడు లేని ఒక విషయాన్ని ఉందని అంటున్నాడు" అనే వాయిస్‌తో ప్రారంభమైన టీజర్ క్రేజీగా ఆకట్టుకుంది. "లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అనేది ఇంకా ఉంది... ఈ అమ్మాయిని చూడగానే అర్థమైంది" అనే డైలాగ్‌తో ప్రదీప్ రంగనాథన్ ఎంట్రీ, కృతి శెట్టిని వర్షంలో కలిసే సన్నివేశం—ఇద్దరి మధ్య కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా కనిపించింది. ఎస్.జె. సూర్య ఎంట్రీ టీజర్‌కు మరో హైలెట్‌గా నిలిచింది. "లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ" అని ఆయన చెప్పే డైలాగ్ ఆకట్టుకుంది. దర్శకుడు విఘ్నేష్ శివన్ ఈ క్రేజీ లవ్ స్టోరీని ఫ్యూచరిస్టిక్ వరల్డ్ బ్యాక్‌డ్రాప్‌లో డిజైన్ చేయడం, వరల్డ్ బిల్డింగ్ చాలా కొత్తగా అనిపించింది. అనిరుధ్ రవిచందర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, రవి వర్మన్ కెమెరా వర్క్ నెక్స్ట్ లెవల్‌లో ఉన్నాయి. మొత్తంగా టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.



అప్పుల్లో ఉన్నవారికి ధైర్యాన్నిచ్చే చిత్రం 'కార్మేని సెల్వం'

దర్శకుడు రామ్ చక్రి

పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రామ్ చక్రి ఇలా ముచ్చటించారు. ''నేను తెలుగులో చూసిన మొదటి సినిమా 'ఆర్య'. ఆ తర్వాత ఆనంద్, గోదావరి మూవీస్ చూశా. అప్పుడు నాకు ఒక విషయం బాగా అర్థమైంది. తెలుగు సినిమా ఇండస్ట్రీ రెండు భిన్నమైన కథల శైలులను ఎంతో అద్భుతంగా స్వీకరిస్తుంది. ఒక వైపు ఆర్య లాంటి ఎనర్జిటిక్, కమర్షియల్ సినిమాలు ఉంటే, మరో వైపు శేఖర్ కమ్ముల గారి ఆనంద్, గోదావరి లాంటి హృదయాన్ని తాకే రియలిస్టిక్ కథలు ఉంటాయి. ఆ బ్యాలెన్స్ నాకు చాలా ఇన్‌స్పిరేషన్ ఇచ్చింది. నేను శేఖర్ కమ్ముల గారితో నేరుగా పని చేసే అవకాశం రాలేదు. అయినప్పటికీ, ఆయనను నా గురువు, మెంటర్‌గా భావిస్తాను. ఆయన సినిమాలను చూస్తూ ఎంతో నేర్చుకున్నాను. అలాగే నా దర్శక గురువు కె.వి. గుహన్ గారికి కూడా నా ధన్యవాదాలు. ఈ ఇద్దరూ నాకు ఇన్‌స్పిరేషన్‌గా నిలిచారు. ఇక 'కార్మేని సెల్వం' విషయానికొస్తే.. ఈ సినిమా మధ్య తరగతి జీవితంపై ఆధారపడి ఉంటుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ కథతో కనెక్ట్ అవుతారు. ముఖ్యంగా అప్పుల సమస్యతో బాధపడుతున్న వారికి ఈ సినిమా ఒక ధైర్యాన్ని ఇస్తుంది. మధ్య తరగతి కుటుంబాల్లో అప్పులు అనేవి కామన్‌గా ఉంటాయి. వాటి కారణంగా కుటుంబంలోని సంబంధాలు, వారు తీసుకునే నిర్ణయాలు ఎలా ప్రభావితం చేస్తాయనేది ఇందులో చూపించబోతున్నాం. చాలా రియలిస్టిక్‌గా మూవీ ఉంటుంది. సముద్రఖని గారు ఆయన పాత్రలోని ప్రతి షేడ్‌ను అద్భుతంగా పండించారు. మధ్యతరగతి భర్తగా, తండ్రిగా తనదైన ఎమోషన్‌ను పండించారు. ఆయనతోపాటు గౌతమ్ మీనన్ గారు, లక్ష్మీ ప్రియా, అభినయ పాత్రలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. మా టెక్నికల్ టీమ్ కూడా ఎంతో సపోర్ట్ చేసింది. మ్యూజిక్ విషయానికొస్తే.. ఈ సినిమా కోసం మేము ఒక కొత్త కాన్సెప్ట్ తీసుకొస్తున్నాం. 'మ్యూజిక్ యాజ్ ఎ సర్వీస్' పేరుతో మా మ్యూజిక్ డైరెక్టర్ రామానుజన్ టీమ్ వర్క్ చేశారు. సంగీతం అనేది కేవలం మ్యూజిక్ డైరెక్టర్ లేదా సింగర్స్‌దే కాదు.. ఇన్‌స్ట్రుమెంటలిస్టులు, సౌండ్ ఇంజినీర్లు, మిక్సింగ్ టీమ్, ఇంకా ఎంతో మంది టెక్నీషియన్లు కలిసి చేసే పనిగా వారు భావించారు. ఈ కాన్సెప్ట్ ద్వారా ప్రతి పాటకు పని చేసిన అందరికీ క్రెడిట్ ఇవ్వడం, అలాగే రెవెన్యూ షేర్ చేయడం మా లక్ష్యం. ఇది మ్యూజిక్ వెనుక ఉన్న అసలు హీరోలకు గుర్తింపు ఇవ్వడానికి మా చిన్న ప్రయత్నం. మా డీఓపీ యువరాజ్ దక్షణ్, ఎడిటర్ జగన్‌లకు ఎంతో అనుభవం ఉంది. థియేటర్‌లో ఈ సినిమా విజువల్స్ చూస్తే, కథను ఎంత గ్రాండ్‌గా తీసుకెళ్లామో అర్థమవుతుంది. ఇక మా ప్రొడ్యూసర్ అరుణ్ రంగరాజులు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఈ కథపై నమ్మకం ఉంచి, మంచి క్వాలిటీతో సినిమా చేయడానికి మాకు సహకరించారు. ఈ సినిమా ద్వారా ఒక ముఖ్యమైన విషయం చెప్పాలనుకున్నా. కుటుంబంలోని పెద్దలు కొందరు విదేశాల్లో జీవనోపాధి కొనసాగిస్తున్నారు. కానీ వారి కుటుంబాలు ఇక్కడే ఉన్నాయి. ఏడాదికి కనీసం ఒకట్రెండు సార్లు అయినా వారు తిరిగి వచ్చి తమ కుటుంబాలతో కలవాలని నేను హృదయపూర్వకంగా కోరుకుంటున్నా. ప్రతి మిడిల్ క్లాస్ ఫ్యామిలీకు ఈ చిత్రం బాగా కనెక్ట్ అవుతుంది''.

ప్రతిపక్షం
Prathipaksham.in
10
హైదరాబాద్
గురువారం
02.04.2026
ఆటలు



ఢిల్లీ బోణీ.. లక్నోపై ఘన విజయం

సమీర్ అజేయ అర్ధ సెంచరీతో విజృంభణ.. రాణించిన ఎంగ్డీ, నటరాజన్

ఐపీఎల్‌లో ఢిల్లీ బోణీ కొట్టింది. బుధవారం లక్నోతో జరిగిన పోరులో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. లక్నో నిర్దేశించిన 142 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ 17.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసింది. సమీర్ రిజ్వీ(47 బంతుల్లో 70 నాటౌట్, 5ఫోర్లు, 4సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీతో అదరగొట్టగా, స్టబ్స్(32 బంతుల్లో 39 నాటౌట్) సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ప్రిన్స్ యాదవ్(2/20) రెండు వికెట్లు తీశాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో.. క్యాపిటల్స్ బౌలర్ల ధాటికి 18.4 ఓవర్లలో 141 రన్స్‌కే కుప్పకూలింది. అబ్దుల్ సమద్ (25 బంతుల్లో 36, 3 ఫోర్లు, 1 సిక్స్), మిచెల్ మార్ష్ (28 బంతుల్లో 35, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగిలినవారంతా విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో ఎంగిడి (3/27), నటరాజన్ (3/29) తలా మూడు వికెట్లు పడగొట్టగా స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ (2/31) రెండు వికెట్లు తీశాడు. బౌలర్లకు సహకరించే లక్నో పిచ్‌పై టాస్ గెలవగానే అక్షర్ మరో ఆలోచన లేకుండా బౌలింగ్ ఎంచుకోగా అతడి నిర్ణయాన్ని సరైనదే అని నిరూపిస్తూ క్యాపిటల్స్ బౌలర్లు ఆరంభం నుంచే కట్టుదిట్టంగా బంతులేశారు. గత సీజన్‌లో మార్ష్‌కు అండగా రాణించిన ఓపెనర్ మార్క్రమ్‌ను కాదని బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్ (7).. రెండో ఓవర్లోనే దురదృష్టవశాత్తూ రనౌట్ అయ్యాడు. అక్షర్ వేసిన పవర్ ప్లే ఆఖరి ఓవర్లో లాంగాన్ మీదుగా సిక్స్ కొట్టిన మార్క్మ (11) తర్వాతి బంతికే క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. తర్వాత నటరాజన్.. బదోనిని ఔట్ చేయగా ఎంగిడి, ప్రమాదకర పూరన్ (8)ను బౌల్డ్ చేశాడు. టాపార్డర్ విఫలమవుతున్నా అడపాదడపా షాట్లు ఆడిన మార్ష్.. కుల్‌దీప్ ఓవర్లో లాంగాఫ్ మీదుగా భారీ షాట్ ఆడబోయి స్టబ్స్ చేతికి చిక్కడంతో లక్నో కష్టాలు మరింత రెట్టింపయ్యాయి. 10 ఓవర్లకు ఆ జట్టు చేసింది 80/5 పరుగులే. ఈ క్రమంలో సమద్ కాస్త ప్రతిఘటించి వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేశాడు. ముకుల్ (14), షాబాజ్ (15*)తో కలిసి ఆ జట్టుకు విలువైన పరుగులు జతచేశాడు. కానీ నటరాజన్ తన ఆఖరి ఓవర్లో సమద్‌ను ఔట్ చేయడంతో లక్నో ఇన్నింగ్స్ ముగియడానికి పెద్దగా టైమ్ పట్టలేదు. 4 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి నాలుగు వికెట్లను కోల్పోయి ఆలౌట్ అయింది.

రిజ్వీ, స్టబ్స్ విజృంభణ

26/4. స్వల్ప ఛేదనలో 4 ఓవర్లకు ఢిల్లీ స్కోరిది. లక్ష్యం చిన్నదే అయినా ఆ జట్టు ఛేదన కష్టంగానే సాగింది. పటిష్టమైన బౌలింగ్ లైనప్‌నకు తోడు పిచ్ సహకరిస్తుండటంతో లక్నో బౌలర్లు పవర్ ప్లేలో క్యాపిటల్స్ బ్యాటర్లకు చుక్కలు చూపించి టాపార్డర్‌ను పెవిలియన్‌కు పంపారు. తొలి బంతికి రాహుల్‌ను షమీ డకౌట్ చేయగా రెండు బౌండరీలు ఓ సిక్స్ కొట్టిన నితీశ్ రాణా (15)ను మోహ్సిన్ ఖాన్ పెవిలియన్‌కు పంపాడు. తర్వాతి ఓవర్లో ప్రిన్స్ యాదవ్.. ఈ లీగ్‌లో అరంగేట్రం చేసిన లంక ఓపెనర్ పతుమ్ నిస్సంక (1)తో పాటు అక్షర్ పటేల్‌నూ ఔట్ చేయడంతో ఢిల్లీ ఆత్మరక్షణలో పడింది. ఈ క్రమంలో రిజ్వీ, స్టబ్స్ వికెట్లను కాపాడుకునేందుకు ప్రాధాన్యమిచ్చారు. క్రీజులో కుదురుకున్నాక షాబాజ్ పదో ఓవర్లో రిజ్వీ.. 3 ఫోర్లతో 16 రన్స్ రాబట్టాడు. మార్క్మ 14వ ఓవర్లో 6, 4తో 37 బంతుల్లో అతడి అర్ధ శతకం పూర్తయింది. ఆఖరి 6 ఓవర్లలో క్యాపిటల్స్ విజయానికి 36 పరుగులు అవసరం కాగా...రిజ్వీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. మోహిసిన్ వేసిన 16వ ఓవర్‌లో ఓ ఫోర్, సిక్స్‌తో రిజ్వీ 13పరుగులు పిండుకోవడంతో గెలుపు సమీకరణం కాస్తా 24 బంతుల్లో 16కు చేరింది. అప్పటి వరకు పొదుపు బౌలింగ్ చేసిన మోహిసిన్ అదే ఒరవడి కొనసాగించలేకపోయాడు. ఆఖర్లో సమద్ బౌలింగ్‌లో సిక్స్‌తో రిజ్వీ..ఢిల్లీకి విజయాన్ని కట్టబెట్టాడు.




మా బౌలింగ్ అద్భుతం.. ఎక్స్‌ట్రాలు కొంపముంచాయి..

కొత్త బంతితో మా బౌలర్లు అద్భుతం ప్రదర్శన కనబర్చారు. కానీ 140పరుగులు చేసినప్పుడు ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురావడం కష్టం. ముఖ్యంగా ఇలాంటి బ్యాటింగ్ వికెట్‌పై ఆ స్కోర్ ఏమాత్రం సరిపోదు. కానీ మా బౌలర్లు గట్టిగా పోరాడారు. మా బౌలింగ్ అప్‌కమింగ్ మ్యాచ్‌లకు మంచి సంకేతం. 20 ఎక్స్‌ట్రాలు సమర్పించుకోవడం మా విజయవకాశాలను దెబ్బతీసాయి. కానీ 140 వంటి తక్కువ స్కోరు ఉన్నప్పుడు ప్రత్యర్థిని ఔట్ చేయడానికి బౌలర్లు ఎక్కువగా ప్రయత్నిస్తుంటారు. ఆ క్రమంలోనే ఇలాంటివి జరుగుతాయి. ఎందుకంటే వారు సాధారణంగా ఆడినా మ్యాచ్ గెలుస్తారు. కానీ ఆరంభంలో కొన్ని కీలక వికెట్లు తీయడం వల్ల వారిని ఒత్తిడిలోకి నెట్టగలిగాం. ఈ సీజన్ మొత్తం నేనే ఓపెనర్‌గా ఆడుతానని ఇప్పుడే కచ్చితంగా చెప్పలేను. ఇది 5050 నిర్ణయం. కానీ నేను టాపార్డర్‌లోనే ఆడుతాను.'అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు.

శ్రేయస్ అయ్యర్‌కు 12 లక్షల జరిమానా

స్లో ఓవర్ రేట్ కారణం

పీఎల్‌లో మంగళవారం గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు మూడు వికెట్ల తేడాతో విక్టరీ సాధించిన విషయం తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు జరిమానా విధించారు. స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి 12 లక్షల ఫైన్ వేశారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 కింద ఈసీజన్ తొలి నేరంగా పరిగణిస్తూ ..స్లో ఓవర్ రేటు కింద అయ్యర్‌కు జరిమానా విధిస్తున్నట్లు ఐపీఎల్ తన ప్రకటనలో తెలిపింది. ముల్లాన్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షోతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుచేసి విజయంతో టైటిల్ వేటను మొదలెట్టింది పంజాబ్ జట్టు. గిల్ సేన నిర్దేశించిన 163 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన కింగ్స్.. 19.1 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి గెలుపు బోణీ కొట్టింది. ఈ లీగ్‌లో అరంగేట్ర మ్యాచ్ ఆడిన కూపర్ కనోలి (44 బంతుల్లో 72 నాటౌట్, 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధశతకానికి తోడు ప్రభ్‌సిమ్రన్ సింగ్ (24 బంతుల్లో 37, 1 ఫోర్, 4 సిక్స్‌లు) రాణించారు. పంజాబ్ ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన టైటాన్స్.. బ్యాటర్ల వైఫల్యంతో 20 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 162 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ గిల్ (27 బంతుల్లో 39, 6 ఫోర్లు), జోస్ బట్లర్ (33 బంతుల్లో 38, 3 ఫోర్లు, 2 సిక్స్) మినహా మిగిలినవారంతా తేలిపోయారు.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200